

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా కేటాయింపులు

- ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే సాధ్యం
- చర్చా గోష్ఠిలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

8

← ప్రసంగిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

పల్లెలు.. పట్టణాల్లో శాశ్వతంగా తాగునీటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వాటర్ గ్రిడ్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కసరత్తు చేపట్టింది. అయితే వాటర్‌గ్రిడ్ అనుసంధానం అన్ని పట్టణాలకు సాధ్యం కాదని కొన్నింటికే పరిమితం చేస్తూ అధికారులు తేల్చారు. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలు వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం సాధ్యం కాదని తేల్చేశారు. 2058 నాటికి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల పరిధిలోని మున్సిపాల్టీల వారీగా నీటి అవసరాలకు సంబంధించిన నివేదికను ఆర్‌డబ్ల్యూ ఎస్ ఇంజనీర్లకు పబ్లిక్ హెల్త్ అధికారులు అందజేశారు. దీనిపై సాధ్యా సాధ్యాలను అధ్యయనం చేసిన సదరు ఇంజనీర్లు కొన్ని మున్సిపాల్టీలనే వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. గ్రిడ్ వ్యయ అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలో సీఎం చంద్రబాబునాయుడు వాటర్ గ్రిడ్‌పై సమీక్షిస్తారని సదరు అధికారులు తెలిపారు.



వాటర్ గ్రిడ్.. కొన్ని పట్టణాలకే

కొన్ని మున్సిపాలిటీలకే అనుసంధానం

- 2058కి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం
- ఆర్‌డబ్ల్యుఎస్‌కు నివేదిక అందజేసిన పబ్లిక్‌హెల్త్
- గుంటూరు సహా పల్నాడులోని పట్టణాలకు అసాధ్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చేందుకు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గ్రిడ్ పథకాన్ని తొలి విడత పల్నాడు జిల్లాలో అమలు చేసేందుకు రూ.1,200 కోట్లతో గతంలో టెండర్ ప్రక్రియను కూడా నిర్వహించారు. టెండర్ ఆమోదించి పనులు చేపట్టే తరుణంలో మున్సిపాల్టీలకు కూడా ఈ పథకాన్ని అనుసంధానం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేసే అంశంలో గత వారం రోజులుగా జరుగుతున్న కసరత్తు ఒక కొలిక్కి వచ్చింది. ఏమున్సిపాల్టీలకు సాధ్యం.. ఏఏ మున్సిపాల్టీలకు సాధ్యం కాదన్న అంశాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు తేల్చేశారు. ఇందుకు సంబంధించి అంచనా వ్యయం రూపొందిస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద ప్లాంట్

వాటర్‌గ్రిడ్‌తో అనుసంధానం చేసి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ప్రకాశం బ్యారేజి సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి - తాడేపల్లి, పొన్నూరు, తెనాలి మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేయవచ్చని అధికారులు నిర్ధారించారు. బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాల్టీలకు నీటిని సరఫరా చేయవచ్చని తేల్చారు. ప్రకాశం బ్యారేజ్ సమీపంలో ఏర్పాటు చేసే నీటి శుద్ధి ప్లాంట్ నుంచి గ్రామాలకు, మున్సి పాల్టీలకు తాగునీటిని సరఫరా చేసే దిశగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

అయితే గుంటూరు కార్పొరేషన్‌తో పాటు పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం సాధ్యం కాదని అధికారులు నిర్ధారించారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, దాచేపల్లి, మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల మున్సిపాల్టీలకు వాటర్‌గ్రిడ్ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు.

ఆ మున్సిపాలిటీల్లో.. అమృత్ 2.0

పల్నాడు జిల్లాలోని గ్రామాలకు వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు టెండర్ నిర్వహించారు. ఈ పనులు త్వరతగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్న తరుణంలో మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం అంశం తెరపైకి వచ్చింది. అయితే పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ సాధ్యం కాదని అధికారులు తేల్చారు. దీంతో ఆయా మున్సిపాల్టీల్లోని నీటి పథకాలను అమృత్ 2.0 కింద విస్తరించనున్నారు. గుంటూరు కార్పొరేషన్‌కు ఉన్న నీటి పథకాన్ని కూడా అమృత్ కింద విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పనులకు సంబంధించిన డీపీఆర్‌లను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే.

మునిసిపాల్టీల వారీగా రానున్న 33 ఏళ్లలో నీటి అవసరాల అంచనా వివరాలు

మునిసిపాల్టీ	ప్రస్తుత నీటి సరఫరా ఎంఎల్‌డీ	2058 నాటికి నీటి అవసరం ఎంఎల్‌డీ
పల్నాడు జిల్లా..		
నరసరావుపేట	22	40.9
చిలకలూరిపేట	16	31.78
వినుకొండ	7	16.94
దాచేపల్లి	2.5	10.99
పిడుగురాళ్ల	9.78	19.63
గురజాల	2	8.74
మాచర్ల	6	17.69
సత్తెనపల్లి	9	17.59
గుంటూరు జిల్లా..		
గుంటూరు	157.2	296.74
మంగళగిరి.. తాడేపల్లి	22.5	98.28
తెనాలి	20	53.87
పొన్నూరు	7.45	18.8
బాపట్ల జిల్లా..		
చీరాల	10	28.07
బాపట్ల	10	24.57
రేపల్లె	4	15.24
అద్దంకి	2.74	13.68

ఎండీఎంఏ మత్తులో విద్యార్థులు



- బెంగళూరు నుంచి గుంటూరుకు సరఫరా
- 9 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్టు.. ఇద్దరు పరారీ
- 10.67 గ్రాముల ఎండీఎంఏ సహా, కేజీ గంజాయి స్వాధీనం

మత్తు మందు ప్యాకెట్లు

గుంటూరు, ఫిబ్రవరి 18: అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ మత్తు మందుకు విద్యార్థులు బానిసలవుతున్నారు. నిషేధిత మత్తు మందును గుంటూరు కేంద్రంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు నాలుగేళ్లుగా సరఫరా చేస్తున్నారు. గుంటూరులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ మత్తు మందును సరఫరా చేస్తున్న వారిని, దానికి బానిసలైన విద్యార్థులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన ఎం సాయికృష్ణ అనే విద్యార్థి గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతడి సోదరుడితో పాటు తెనాలి సమీపంలోని చినరావూరుకి చెందిన ధరావత్ సతీష్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో గతంలో సాయికృష్ణ అనేక సార్లు బెంగళూరు వెళ్లగా అక్కడ సతీష్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. సతీష్‌కుమార్ అప్పటికే బెంగళూరుకు చెందిన నితిన్ అనే వ్యక్తితో కలిసి ఎండీఎంఏ మత్తుమందును వినియోగిస్తున్నాడు. దీంతో సతీష్ కుమార్ ద్వారా సాయికృష్ణ కూడా ఆ మత్తుకు బానిసయ్యాడు. ఆ మందును గుంటూరులో విక్రయించి సొమ్ము చేసుకోవచ్చని నితిన్ సూచించాడు. దీంతో నితిన్ ద్వారా ఆ మందును నాలుగేళ్లుగా సాయికృష్ణ, సతీష్‌కుమార్ గుంటూరు తెచ్చి ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల కోదండ రామానగర్‌లోని సాయిలక్ష్మీ అపార్ట్‌మెంట్లో ఉంటూ మత్తు మందును విద్యార్థులకు విక్రయిస్తు న్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం రోడ్డులో ఎక్సైజ్ టూ టౌన్ సీఐ యశోదరాదేవి సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గుడి పక్కన ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు అధికారులను చూసి గాబరాపడుతుండగా అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.52 గ్రాముల ఎండీఎంఏ మత్తు మందును వారి వద్ద గుర్తించారు. ఆ మందును అమ్ముకోవడానికి తాము వచ్చినట్లు విచారణలో ఎక్సైజ్ అధికారులకు వారు చెప్పారు. సాయికృష్ణ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఎక్సైజ్ అధికారులు అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేపట్టగా 8.15 గ్రాముల మత్తుమందుతోపాటు, కేజీ గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు లభించాయి. ఫ్లాట్‌లో సాయికృష్ణతో ఉన్న ఏడుగురు విద్యార్థులను కూడా గుర్తించారు. చెరుకుల కృష్ణారెడ్డి(జాకీర్‌హుస్సేన్ నగర్), రాచభత్తుని రాహుల్ (శివనాగరాజుకాలనీ), దొంత ప్రవీణ్ అలియాస్ మమ్మీ(ఆదర్శనగర్), అందే లోకేశ్(పట్టాభిపురం), కొప్పుల ప్రద్యుమ్న(రెడ్డిపాలెం), మొలబంటి సాయికృష్ణ(కాజ), ధరావత్ సతీష్‌కుమార్ (చిన్నరావూరు), మద్దిబోయిన దొరస్వామి రాజు(యడ్లపాడు మండలం కొత్తపాలెం), విష్ణుమొలకల చైతన్య (కారంపూడి మండలం లక్ష్మీపురం) అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉండగా 9 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సాయికృష్ణ బంధువు వేంపాటి చైతన్య, బెంగళూరుకు చెందిన నితిన్‌లను అరెస్టు చేయాల్సి ఉంది. ప్రమాదకరమైన మత్తుమందు కేసును ఛేదించిన టూ టౌన్ ఎక్సైజ్ సీఐ ఎం యశోదరా దేవిని డీసీ డాక్టర్ శ్రీనివాసులు అభినందించారు. గత నెలలో కొకైన్ కేసును కూడా సీఐ ఛేదించారన్నారు. ఎస్ఐలు సత్యనారాయణ, మాధవి, హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతరావు, సీహెచ్ రాజు, మైలా శ్రీనివాసరావు, రవిబాబు, బీఎస్ఎన్ రాజు, పీ నాగేశ్వరరావు, ఎం సూర్యనారాయణ, వీవీ చారి చిన్నబాబు తదితరులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవికుమారెడ్డి, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి వీ అరుణకుమారి, ఏఈఎస్ ఈడే మారయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు

గ్రాము రూ.5వేలకు విక్రయం..

బెంగళూరులో ఎండీఎంఏ మత్తుమందును గ్రాము రూ.1400 కొనుగోలు చేసి రూ4,000 నుంచి 5 వేలకు అమ్ముతున్నారు. గుంటూరు సమీపంలోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలోని కొందరు విద్యార్థులకు ఈ మందును సాయికృష్ణ అలవాటు చేశాడు. గోరంట్లలోని తన ఫ్లాట్‌కి విద్యార్థులను పిలిపించుకుని మత్తు మందును విద్యార్థులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడు. నాలుగేళ్లుగా సాయికృష్ణ ఈ వ్యాపారం చేస్తున్నాడు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి తన స్వగ్రామానికి చెందిన సమీప బంధువు ద్వారా విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

అత్యంత ప్రమాదకరం

బ్రౌన్‌షుగర్, కొకైన్.. వంటి మత్తు మందులకంటే ఎండీఎంఏ అత్యంత ప్రమాదకరమైందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మత్తు మందుకు బానిసైన వారిలో నరాల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఆలోచనలు, విచక్షణ కోల్పోతారన్నారు. ఆకలి, నిద్ర ఉండదన్నారు. ఈ మందుకు బానిసైన వారు నగదు కోసం ఎంతటి అఘాయిత్యానికైనా పాల్పడతారన్నారు.

నాడు ముంచేసి.. నేడు మొసలికన్నీరు

- సీఎంగా వారి గోడు పట్టించుకోని జగన్
- అప్పట్లో నల్లి తెగులు సోకి రూ.వందల కోట్ల నష్టం
- పరిహారం చెల్లింపుపై డీఆర్‌సీ తీర్మానమూ బుట్టదాఖలు
- కోడ్ ఉందని అధికారులు చెప్పినా నేడు గుంటూరు పర్యటన

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధినేత జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏనాడూ మిర్చి రైతుల గోడు పట్టించుకోలేదు. 2022, 2023 సంవత్సరాల్లో నల్లి తెగులు సోకి రైతులు నష్టపోయారు. అలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతులను ఆదుకునేందుకు సీఎం పీఠంపై ఉన్న జగన్ ముందుకు రాలేదు. గుంటూరు జిల్లా సమీక్ష మండలి సమావేశంలో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు మిర్చి రైతులను ఆదుకోవాలని నాడు తీర్మానం చేసి నివేదించినా పట్టించుకోలేదు. ఇంతచేసి తమ ప్రభుత్వ హయాంలో మిర్చి క్వింటాల్‌కు రూ.22 వేల ధర లభించిందని, ఇప్పుడు కనీసం రూ.12 వేలు కూడా లేదని వైసీపీ నేతలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక మరుసటి ఏడాది కరోనా వచ్చి మిర్చి రైతులు ఇబ్బందిపడితే ఆదుకోలేదు. యార్డుకు ఏటా మార్కెట్ ఫీజు రూపంలో వచ్చే రూ.100 కోట్లకు పైగా ఆదాయాన్ని సీఎఫ్ఎంఎస్‌కు బదలాయించేసుకున్నారు. ఇలా అన్ని రకాలుగా రైతును దగా చేసిన జగన్ ఇప్పుడు ధర పడిపోయిందని మొసలి కన్నీరు కార్చేందుకు వస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

పెరుగుతున్న ధరలు..

వాస్తవానికి యార్డులో మిర్చి ధరలు ఇప్పు డిప్పుడే పెరుగుతున్నాయి. క్వింటాల్ ధర రూ.14 వేలు దాటింది. మరికొద్ది రోజుల్లో ఇంకా పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మిర్చి ధర తక్కువగా ఉండటంపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఇప్పటికే సీఎంకు నివేదించారు.



టీడీపీ ప్రభుత్వంలో ఆపన్నహస్తం

2014-19 మధ్య టీడీపీ హయాంలో మిర్చి ధర పతనమైతే అప్పటి మార్కెటింగ్ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, యార్డు చైర్మన్ మన్నవ సీఎం చంద్రబాబుకు నివేదించి రైతులను ఆదుకున్నారు. క్వింటాల్‌కు రూ.1,500 అందించి మార్కెట్‌ను నిల బెట్టారు. అప్పట్లో ఒక్క గుంటూరు మిర్చియార్డు పరిధిలోని రైతులకు రూ.118 కోట్లకు పైగా సాయం అందింది.

ఐదేళ్లలో రూ.436 కోట్లు స్వాహా

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పరిపాలనలో మిర్చియార్డుకు రావాల్సిన రూ.వందల కోట్లను ఆ పార్టీ నేతలు దోచేశారు. ఇటీవల విజిలెన్స్ విభాగం రికార్డులు తనిఖీ చేసి రూ.436 కోట్లు వైసీపీ నేతలు, అప్పటి అధికారుల జేబుల్లోకి పోయాయని నివేదిక కూడా సమర్పించింది.

కోడ్ ఉందని చెప్పినా...

కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నిక 27న జరగనుంది. కోడ్ అమలులో ఉన్న సమయంలో యార్డులో రాజకీయ నేతల పర్యటనకు అనుమతి లేదు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ వైసీపీ నేతలు పర్యటిస్తే కన్నెర్ర చేసిన ఈసీ ఆరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసింది. ఈ విషయాన్ని మార్కెటింగ్ అధికారులు చెప్పినా వైసీపీ నేతలు పట్టించుకోవడం లేదు. జగన్ వచ్చి రైతులతో మాట్లాడతారని, సభ పెట్టరని చెబుతున్నారు. కోడ్‌కి, జగన్ పర్యటనకు సంబంధం లేదని వితండవాదం చేస్తున్నారు.

పర్యటనకు అనుమతులు కోరలేదు: కలెక్టర్

మిర్చియార్డులో మాజీ సీఎం జగన్ పర్యటనకు సంబందించి జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ నుంచి వైసీపీ నాయకులు ఎలాంటి అనుమతులు అడగలేదని కలెక్టర్, ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ మాత్రమే తనకు, ఎస్పీకి పంపించారన్నారు. దీనిపై చీఫ్ ఎలక్టోరల్ అధికారికి నివేదించామని, సీఈవో కార్యాలయం నుంచి ఇంకా ఆదేశాలు అందలేదన్నారు. బుధవారం యార్డు వద్ద పరిస్థితిని బట్టి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

కృష్ణబాబు చెబితే మాకేంటి!

- ఆరోగ్య శాఖలో అడ్డగోలు డిప్యుటేషన్లు
- ప్రిన్సిపల్ సెక్రటరి ఆదేశాలకు పాతర
- పని ఉన్న చోట నుంచి తెచ్చి పని లేని చోట ఉద్యోగం
- వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వారికి అదే చోట పోస్టింగ్

8

కొండవీడు కోట అభివృద్ధికి కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి కట్టడాల పరిశీలన

ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ఎంఏ తెలుగు పరీక్ష ఫలితాలు విడుదల

6

విద్యార్థులకు.. ముఖహాజరు

బీసీ వసతి గృహాల్లో అమలుకు ఆదేశాలు

ఇక పక్కాగా లబ్ధి

బీసీ వసతిగృహాల్లోని పేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే లబ్ధి పక్కాగా అందనున్నది. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా తీసిన ఫొటోను ఏపీనివాస్ యాప్‌లో నమోదు చేస్తారు. అందులో విద్యార్థి చదువు, ఎక్కడ నివాసం ఉంటున్నాడు.. తదితర వివరాలు నిక్షిప్తం అవుతాయి. ఈ విధానం ద్వారానే విద్యార్థుల మెస్ బిల్లులు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల ఎటువంటి అక్రమాలకు అస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని అన్ని బీసీ హాస్టళ్లలో ఈ నెల ఒకటి నుంచి ముఖ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నట్లు సంక్షేమశాఖాధికారి మయూరి తెలిపారు. మెస్ సహా ఇతర అన్ని బిల్లులు దీనికి అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలలోపు హాజరు పూర్తి చేసి వివరాలను వెల్ఫేర్ ఆఫీసర్లు యాప్‌లో అప్‌లోడు చేయాల్సి ఉంటుందన్నారు.

- సాంకేతికతతో బోగస్ హాజరు నియంత్రణ
- హాస్టళ్లకు సంబంధించిన బిల్లులు యాప్‌కు అనుసంధానం

గంటూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక పోయినా ఉన్నట్లుగా.. వారు భోజనం చేయకపోయినా చేసినట్లుగా.. ఇతర పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లుగా.. ఇలా అనేక వసతిగృహాల్లో పెద్దసంఖ్యలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇక నుంచి ఇలాంటి అక్రమాలను అడ్డుకు నేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధమైంది. బోగస్ హాజరును నివారిస్తే అక్రమాలకు చెక్ పడినట్లేనని ఆ దిశగా ప్రభుత్వం చర్యలకు ఆదేశించింది. ఈ క్రమంలో తొలుత బీసీ సంక్షేమ వసతిగృహాల్లో బోగస్ హాజరు నివారణకు నూతన సాంకేతిక విధానం అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే అమలు చేసిన ముఖ హాజరు(ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్)ను ఇక నుంచి బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు అమలు చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి ప్రత్యేక యాప్ ద్వారా నూతన హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా దాదాపు 90శాతం పైగా సరైన హాజరు వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు(3 నుంచి 10వ తరగతి వరకు) 65పైగా, కళాశాల స్థాయి విద్యార్థులకు 36 వరకు హాస్టల్స్ ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 7 వేలమందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు.



ఫోన్‌లో యాప్ ద్వారా ముఖ హాజరు తీసుకుంటున్న సిబ్బంది

బయోమెట్రిక్‌లోనూ.. బోగస్ హాజరు

బీసీ వసతిగృహాల్లో గతంలో విద్యార్థులకు బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు తీసుకున్నారు. ఇందులో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. అనేక హాస్టళ్లలో బయోమెట్రిక్ యంత్రాల ద్వారా సైతం బోగస్ హాజరు నమోదు చేసినట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. గతంలో విజిలెన్స్ అధికారులు చేసిన దాడుల్లో బోగస్ హాజరు బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈవిధానాన్ని ఎంపిక చేసిన వసతిగృహాల్లో అమలు చేశారు. అది విజయవంతం కావడంతో అన్ని వసతి గృహాల్లోనూ ఫిబ్రవరి 1 నుంచి అమలు చేస్తున్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
● ఎమ్మెల్యే జూలకంటితో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కారంపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరుజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం పట్టణంలో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, వ్యవసాయదారులు, పారిశ్రామికవేత్తలు ఎన్నో కష్టాలు పడి నష్టపోయారని, ఆ భయంతోనే కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు ఇచ్చి ప్రజలు వైసీపీపై తమ వ్యతిరేకతను నిరూపించుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాశనం చేసిన పోలవరం ప్రాజెక్టును, రాజధాని అమరావతిని గాడిలో పెట్టి పనులు ప్రారంభింపజేశామని, వీటన్నిటి కోసం 75 యేళ్ల వయసులో 25 యేళ్ల కుర్రవాడిగా పనిచేస్తూ సీఎం చంద్రబాబునాయుడు తమకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో తమ పెట్టుబడుల ద్వారా పరిశ్రమలు నెలకొల్పనున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తక్కువ కాలంలోనే రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిందని మంత్రి రవికుమార్ అన్నారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ 8 నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమిపై ఎంతో నమ్మకముంచి అఖండ మెజార్టీతో కూటమని గెలిపించారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను, అప్పులను, విధ్వంసాలను పూర్తిగా గ్రహించడానికి నాలుగు నెలలు పట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభకు ముందుగా స్వర్గీయ తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, పక్కన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న పరీక్షల సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు

బీ ఫార్మసీ పరీక్షలు ప్రారంభం

● కేంద్రాలలో సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు తనిఖీ
● మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచన

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బీఫార్మసీ 4/4 ఏడవ సెమిస్టర్ (రెగ్యులర్), 3/4 ఆరవ సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షలు పటిష్ట ఏర్పాట్లు మధ్య మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు, ప్రకాశం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏడవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల పరీక్షా కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో 24 మంది విద్యార్థులకు ఇద్దరు చొప్పున ఇన్విజిలేటర్లు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకుగానూ పరిశీలకులను, తనిఖీకి స్క్వాడ్ బృందాలను నియమించామని ఆచార్య సుబ్బారావు తెలిపారు.

జగన్‌కు జైళ్ల పరామర్శలే బాగున్నట్లుంది

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శ

వినుకొండటౌన్ ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు రాకుండా కుంటిసాకులు చెప్పే మాజీ సీఎం వైఎస్ జగన్‌కు జైళ్ల పరామర్శలే బాగున్నట్లుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. మంగళవారం ఉదయం వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నరసరావుపేట రోడ్డులోని సాయిబాబా గుడి వాకింగ్‌ట్రాక్ వద్ద ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని కూటమి అభ్యర్థి డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే అసెంబ్లీకి రాకుండా జైళ్లు పట్టుకొని తిరుగుతున్నాడని అన్నారు. 151 నుంచి 11కి తీసుకువచ్చి ప్రజలు ఎప్పుడో వైసీపీని రోడ్డు మీద నిలబెట్టారన్నారు. జగన్, వైసీపీ నేతల నేర మనస్తత్వాలకు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు మరో ఉదాహరణ అని అన్నారు. వంశీ లాంటి డెకాయిట్లు జైల్లో ఉంటేనే రాష్ట్రంలో శాంతిభద్రతలకు, ప్రజలకు భరోసా ఉంటుందన్నారు. జగన్ సర్టిఫికెట్లుచ్చినంత మాత్రాన హంతకులు రౌడీలు మంచివాళ్లు కారన్నారు. జగన్ తలకిందులుగా తపస్సు చేసినా చచ్చిన వైకాపా లేవదు, జగన్‌ను జనం నమ్మరని జీవీ తెలిపారు.


బంగారు రుద్రాక్షమాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న చంద్ర శ్రీనివాసరావు, చిత్రంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు

త్రికోటేశ్వరునికి రూ.20 లక్షల విలువైన
బంగారు రుద్రాక్షమాల సమర్పణ

చిలకలూరిపేట,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వరునికి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన, హైదారాబాద్ గోకుల్ కన్‌స్ట్రక్షన్ అధినేత చంద్ర శ్రీనివాసరావు రూ. 20 లక్షల విలువైన బంగారు పంచముఖ రుద్రాక్షమాలను మంగళవారం సమర్పించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు సమక్షంలో ఆయన ఆ రుద్రాక్షమాలను ఆలయ కమిటి వారికి అందచేశారు.

రాజకీయ సన్యాసంపై కాసు కట్టుబడి ఉండాలి

● నీతి, విలువలపై ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదం
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఎన్నికలలో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న మాటలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కట్టుబడివుండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 2019-24 మధ్య రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా గురజాల నియోజకవర్గంలోనూ అరాచకాలు, విధ్వంసాలకు పాల్పడ్డారని, 1వ తేదీన పింఛన్, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితి వుందని, రోడ్లపై గుంతలు పూడ్చలేని స్థితి నుంచి ఇప్పుడిప్పుడే రాష్ట్రం ప్రగతి పట్టాలపైకి ఎక్కుతుందన్నారు. ఏడు నెలల కాలంలో రాష్ట్రంలో అనేక పెట్టుబడులకు చంద్రబాబుపై వున్న నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాసు మహేష్ రెడ్డికి లేదని, గత మున్సిపల్ ఎన్నికల సమయంలో నామినేషన్లు కూడా వేయనీయకుండా, అధికారుల కళ్లెదుటే నామినేషన్ పత్రాలను చించివేసినా స్పందించని అధికారులు కాసు మహేష్‌రెడ్డి నేడు స్వచ్ఛందంగా 17 మంది కౌన్సిలర్లు పార్టీ మారటంపై మాట్లాడటం సిగ్గుచేటుగా వుందన్నారు. కౌన్సిలర్లే స్వచ్ఛందంగా పార్టీ మారుతున్నట్లు, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో కూడా అధికారులు నిబంధనల ప్రకారమే పని చేశారని, ఆ విధంగానే వీడియోలోనూ ఆధారాలు వున్నాయన్నారు. పిడుగురాళ్ల మునిసిపాలిటీలో అధికార మార్పు, కూటమి ప్రభుత్వంపై జగన్ వ్యాఖ్యలకు ఎమ్మెల్యే యరపతినేని ఘాటుగానే కౌంటర్ ఇచ్చారు. అభివృద్ధి కోసమే కౌన్సిలర్లు టీడీపీలోకి చేరినట్లు స్వచ్ఛందంగా ప్రకటించాక మాట్లాడటం అర్థం పర్థం లేనిదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతో కూటమి నేతలు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ఇటువంటి రాజకీయ గొడవలు, అక్రమ కేసులు, దాడులకు పాల్పడటం లేదని తెలిపారు. వైసీపీ హయాంలో పింఛన్లు రాజకీయం చేశారని, పథకాలను తీసివేశారన్నారు. నేడు అలా కాకుండా అర్హులైన వారందరికీ పింఛన్లు, ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామన్నారు. సమావేశంలో పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వున్నం సురేష్, కామిశెట్టి రమేష్, పిల్లి చెన్నారావు, దూదేకుల ఖాశింసైదా, చావా రామారావు, ఎల్‌వీఆర్, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం ఆంజనేయులు, మందా డేవిడ్, ఇతర నేతలు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పరిశోధనలతో పాటు ఉపాధి అవకాశాలు

● బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల శాస్త్రవేత్తల బృంద సభ్యుల వెల్లడి
● వర్సిటీలో వృక్ష, జంతు, సూక్ష్మజీవ శాస్త్ర విభాగాల సందర్శన


బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్ర విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు అనంతరం బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల్లో పరిశోధనతోపాటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆయా సంస్థల శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ శంకర్రావు, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ దీప జైశవల్, డాక్టర్ రాజమోహన్ సందర్శించారు. వర్సిటీలోని వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రం, ఫారెస్ట్రీ, జంతుశాస్త్ర విభాగాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమై పలు విషయాలను చర్చించారు. అనంతరం విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జునతో సమావేశమై పశ్చిమ కనుమలు, మడ అడవులలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం ఇన్‌చార్జివీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలను మర్యాదపూర్వకంగా కలిశారు. బయో డైవర్సిటీ నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని గూర్చి తెలియజేశారు. ఈ సమావేశానికి అనుమతి ఇచ్చినందుకు గాను వర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డుతో అవగాహన ఒప్పందం చేసుకునేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. కార్యక్రమంలో ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య రామచంద్రన్, ఆచార్య వెంకట రత్నమ్మ, ఆచార్య ఉమా మహేశ్వరరావు, ఆచార్య ఎస్ఎం ఖాసిం, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కె.బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ మిధున్, డాక్టర్ బాలరాజు, డాక్టర్‌విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కొండవీడు కోట అభివృద్ధికి కృషి

● మంత్రి గొట్టిపాటి రవికుమార్
●ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి కట్టడాల పరిశీలన

యడ్లపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కొండవీడుకోట అభివృద్ధి కృషి చేస్తామని, దీనిపై త్వరలోనే సీఎంతో చర్చిస్తానని విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలసి ఆయన కొండవీడుకోటను సందర్శించారు. ముందుగా కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం చారిత్రక కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సినిమా చిత్రీకరణ చేస్తున్న నటుడు శివాజీని, చిత్ర యూనిట్‌ను కలసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవీడు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఈ ప్రాంతంలో సినిమాల చిత్రీకరణ పెద్ద ఎత్తున జరగాలన్నారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు.. ఎమ్మెల్యే ప్రత్తిపాటి

టెంపుల్ టూరిజం అభివృద్ధికి అత్యధిక అవకాశాలున్న ప్రాంతం కొండవీడు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఘాట్‌రోడ్డు నిర్మాణం జరిగిందని, దాంతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయన్నారు. . కొండవీడుకోట గొప్పతనం ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ప్రాంతానికి చెందిన నటుడు శివాజీ చారిత్రక కొండవీడుకోటలో చిత్రనిర్మాణం చేపట్టి గుర్తింపు తీసుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. మరిన్ని చిత్రాలు ఇక్కడ షూటింగ్ జరుపుకునేలా ప్రోత్సహిస్తామన్నారు.


నటుడు శివాజీని సత్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కొండవీడు విశేషాలు తెలియజేయాలనే.. నటుడు శివాజి

స్థానిక ప్రతిభను ప్రోత్సహించేందుకు, కొండవీడు విశేషాలను ప్రజలకు తెలియ చేసేందుకు ఇక్కడ సినిమా షూటింగ్ చేస్తున్నామని, అందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని సినీ నటుడు శివాజీ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల విజేత
తెనాలి ఎన్ఆర్‌కే కళాశాల

పెదకాకాని, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ వాలీ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో తెనాలిలోని ఎన్ ఆర్ కే అండ్ కేఎస్ఆర్ గుప్తా కళాశాల మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల నిలువగా, మూడవ స్థానంలో రేపల్లెలోని ఏబీఆర్ ప్రభుత్వ కళాశాల నిలిచినట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి బి. అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విజేత జట్ల క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి వర్సిటీ ప్రతిష్టను పెంచాలని కోరారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చే యూనివర్సిటీగా ఏఎన్‌యూ ఎదగాలని ఆకాంక్షించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం
ఎంఏ తెలుగు పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని దూరవిద్య కేంద్రం 2024 అక్టోబరు, నవంబరులో నిర్వహించిన ఎంఏ తెలుగు 1, 2 ,3 ,4 సెమిస్టర్ పరీక్షల రెగ్యులర్ / సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. కోదండపాణి తెలిపారు. ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్ సైట్‌లో ఉంచినట్లు వివరించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.960 చెల్లించి, మార్చి 3వ తేదీలోగా పరీక్షల కో ఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు పంపాలన్నారు. ఈ కార్యక్ర మంలో డైరెక్టర్ ఆచార్య వివెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డి నేటర్ ఆచార్య డి.రామచంద్రన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి పాల్గొన్నారు.

1,43,296 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,63,393 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,43,296 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. యార్డు ఆవరణలో 68,321 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిర్చి ధరలు ఈ విధంగా ఉన్నాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600
నంబరు. 5	11000	14300
273	10000	12300
341	10000	14000
4884	10000	12800
సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	13900
బ్యాడిగి	10000	13700
దేవనూరు డీలక్స్	10000	13000
తాలుకాయలు	4000	7000

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆ విభాగపు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు కోరారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికై బుధవారం నగరంలో వీసీకే సమావేశ మందిరంలో జరిగే రాష్ట్ర నిర్మాణ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మేడా హనుమంతురావు, అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర అలవాట్లను అలవర్చుకోవాలి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే వ్యాయామం, చక్కటి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ ఉద్బోధించారు. మల్లికార్జునపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వైద్య కళాశాల సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీఎం విభాగాధిపతి డాక్టర్ సీతారామ, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందన, పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, ఎస్పీఎం పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

లండన్‌లో ఉన్న శిల్ప సంపదను అమరావతికి తెప్పించాలి : జాస్తి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పరిపాలన సమయంలో అమరావతి నుంచి లండన్ తరలించిన బౌద్ధ శిల్ప సంపద ను తిరిగి రాష్ట్రానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కార్తికేయ మిశ్రా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వీరాంజనేయులు వెల్లడించారు.

కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు ఉదయమే విధులు నిర్వహించే ప్రజారోగ్య కార్మికులు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం విధి నిర్వహణలో కారు ప్రమాదంలో మృతి చెందిన కార్మికురాలు జి.కొండమ్మ కుటుంబానికి నగరపాలక సంస్థ తరుపున పూర్తి అండగా ఉంటామని కమిషనర్ భరోసా ఇచ్చారు. మంగళవారం ప్రమాదంలో మృతి చెందిన కొండమ్మ మృతదేహాన్ని కమిషనర్ ఆదేశాల మేరకు సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ప్రజారోగ్య అధికారులు ప్రభుత్వ వైద్యశాలలో సందర్శించి, కుటుంబసభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

గుంటూరు(తూర్పు) ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి సీజన్ ప్రారంభమై సరైన ధరలు లభించక ఇబ్బందులు పడుతుంటే రైతుల్ని పలకరించే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చెందారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, పి.జగన్నాథం పాల్గొన్నారు.

రైతుల కష్టాలు తెలుసుకునేందుకే జగన్ పర్యటన : అంబటి

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను తెలుసుకునేందుకు మాజీ సీఎం జగన్ బుధవారం ఉదయం మిర్చి యార్డుకు వస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మిర్చి ధరలు తగ్గటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, లేకుంటే రైతుల పక్షాన వైసీపీ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

క్లబ్‌లో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

● అనుచరులతో వెళ్లి యువకుడిపై దాడి

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని ఒక క్లబ్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణ చినికి చినికి గాలివానగా మారి ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి దారితీసింది. క్లబ్బులో రావిపాటి అప్పారావు, శివ ప్రసాద్ మధ్య గొడవ జరిగింది. దానిని మనసులో పెట్టుకున్న శివప్రసాద్ తన అనుచరులతో విద్యానగర్ 1వ లైనులోని రావిపాటి అప్పారావు ఇంటిపై దాడి చేసినట్లు తెలిసింది. ఈ దాడిలో రావిపాటి అప్పారావుకు తీవ్ర గాయాలు కాగా వెంటనే ఆయనను రమేష్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. దాడికి దారి తీసిన కారణాలు, ఇందులో ఎవరెవరు పాల్గొన్నారు తదితర పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వయో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టాభిపురం పెట్రోల్ బంక్ రోడ్డులోని రవీంద్ర నగర్ ఒకటో లైన్‌లో గల అనురాగ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ కేవిజయలక్ష్మి ప్రారంభించారు.

పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తా : ఆలపాటి



వర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విశ్వవిద్యా లయంలో పర్యటించారు. మాదిగ విద్యార్థి సమాఖ్య విద్యార్థి నాయకులు, బీసీ విద్యార్థి సంఘం, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని పలు కార్యాలయాల విభాగాలు సందర్శించి గ్రాడ్యుయేట్ అభ్యర్థుల ను ఓట్ల అభ్యర్థించారు. కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న తనను గెలిపించి విద్యారంగ బలోపేతానికి సహకారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం వికాసభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ విద్యార్థులకు, ఉద్యోగులకు మేలు చేసింది కూటమి ప్రభుత్వమే అని, భవిష్యత్తులో విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ద్వారా ఎన్నో ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే విద్యార్థుల, ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు కాకుమాను ప్రఫుల్, ఏఎన్‌యూ టీఎన్‌ఎస్‌ఎఫ్ శాఖ అధ్యక్షుడు నితీష్ , టీఎన్ ఎస్‌ఎఫ్ శాఖ ప్రధాన కార్యదర్శి నరేంద్ర, నాయకులు ఖయ్యూం ఎంఎస్‌ఎఫ్ ముఖ్య సలహాదారుడు దుడ్డు నరేంద్ర, వైస్ ప్రెసిడెంట్ అఖిల్, సెక్రటరీ కోటి, జాయింట్ సెక్రటరీ రాజేష్, చంద్రశేఖర్, బీసీ విద్యార్థి సంఘ నాయకులు వీరాంజనేయులు, రవికుమార్, జనసేన విద్యార్థి సంఘ నాయకులు పవన్ సాయి, మహేష్ పరిశోధకులు గంగాధర్, రాజేష్, అభిషేక్, చంద్రబాబు పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపునకు 'మేడ్' మద్దతు : దేవపాల్

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరుపున బరిలో నిలిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మేడ్ మద్దతుగా నిలుస్తుందని మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ (మేడ్) రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ తెలిపారు. కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు అనేక అవకాశాలు రావటానికి చొరవ తీసుకుంటున్న నేపథ్యంలో అందరూ ఆలపాటికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు నగర అధ్యక్షులు రావెల నల్లయ్య, కొల్లిపర ఆనందరావు, డాక్టర్ చిలకా వెంకటేశ్వరరావు, బందెల నవీన్, కందుకూరి మరియదాసు తదితరులున్నారు.

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్లో ఏవిధమైన పనులు చేయడానికి వీల్లేదు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్లో నిర్మాణ పనుల నిలిపివేత ఉత్తర్వులు అమల్లో ఉన్నందున తదుపరి ఏ విధమైన పనులు జరగడానికి వీల్లేదని, పర్యవేక్షణకు అదనపు కమిషనర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ ప్రాథమిక నివేదిక ఇచ్చిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ కమిటీలోని అధికారులతో కలిసి గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్లో సెల్లార్లు, గృహ ప్రవేశం జరిగిన ఫ్లోర్, నిర్మాణ ప్రదేశాలు, పరిసరాలను సమగ్రంగా పరిశీలించి, అధికారులు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో కమిటీ సభ్యులు అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్ సి.హెచ్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ కోటేశ్వర రావు, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

గుంటూరు నగర పరిధిలోని విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా బుడంపాడు, బొంతపాడులోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే ప్రజారోగ్య కార్మికుల రేషనలైజేషన్ పూర్తవుతున్నందున పారిశుధ్య పనుల్లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ నూరుశాతం జరిగేలా పర్యవేక్షణ చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్లకు స్పష్టం చేశారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ సతేష్ కుమార్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వేలన్నీ రెండు రోజుల్లో పూర్తి చేయాలి

గుంటూరు నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా ప్రభుత్వ ప్రాధాన్య సర్వేలన్నీ 2 రోజుల్లో పూర్తయ్యేలా నోడల్ అధికారులు పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం సర్వేల వేగవంతంపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, నోడల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

రోడ్లమీద వ్యర్థాలు వేస్తే వాణిజ్య సంస్థలకు భారీ అపరాధ రుసుం

నగరంలో మార్చి 1వ తేదీ నుంచి రోడ్ల మీద వ్యర్థాలు వేసే కమర్షియల్ సంస్థలకు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని, స్వచ్ఛ గుంటూరుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులు, కార్యదర్శులతో పారిశుధ్య పనులు, ట్రేడ్ లైసెన్స్‌లపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం, ఎంహెచ్‌వో రవిబాబు, వెటర్నరీ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్‌వోలు రాంబాబు, ఆనందకుమార్, శానిటరీ సూపర్వైజర్లు , ప్రజారోగ్య విభాగ సూపరిండెంట్ పోలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22న కవలల పోటీలు



మాట్లాడుతున్న పి రామచంద్రరాజు, పాల్గొన్న శ్రేష్ఠ ఆస్పత్రి వైద్యులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా ఈనెల 22న సాయంత్రం భారతీయ విద్యాభవన్స్, శ్రేష్ఠ హాస్పిటల్, గుజనగుండ్ల సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ విద్యాభవన్‌లో కవలల పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు అన్నారు. స్థానిక భారతీయ విద్యాభవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకే వేదిక మీద అనేక మంది కవలల ప్రదర్శన ఏర్పాటు చేసి వారి భావాలు, వారి ఆలోచనలు, వారి వ్యక్తిత్వాలు ఎదుటి వారికి తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనేవారు 83176 13187 నెంబర్‌కు లేదా భారతీయ విద్యా భవన్ పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రేష్ఠ ఆస్పత్రి ఎండీ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున, డాక్టర్ వై. సుష్మిత, హేమాంబ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ బెస్ట్ ఆర్ట్ స్కూల్ పోటీలలో సీతారామయ్య హైస్కూల్‌కి తృతీయ స్థానం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన 19వ వార్షికోత్సవం నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్‌లో నేషనల్ బెస్ట్ ఆర్ట్ స్కూల్‌గా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య (సీబీఎస్ఈ) పాఠశాల తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుందని పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులతో పోటీపడిన తమ విద్యార్థులు 25 బంగారు పతకాలు, 18 రజత పతకాలు పొందారని తెలిపారు. డ్రాయింగ్ టీచర్స్ వి. హేమలత, ఎస్.కమల, ఎం.ఝాన్సీలను విశిష్ట ఆచార్య పురస్కారంతో సత్కరించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని, ఆర్ట్ టీచర్స్‌ని పాఠశాల పాలవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతి దేవి, కోఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, శ్రీదేవి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్రవికాసం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల సమగ్ర వికాసం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగపడతాయని డిప్యూటీ డీఈవో ఏసురత్నం అన్నారు. చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్ల జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉర్దూ డీఐ ఎస్‌కేఎండీ ఖాసిం, తూర్పు ఎంఈవో ఖుద్దూస్ మాట్లాడుతూ శిక్షణ తరగతుల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిసోర్సుపర్సన్లు జిఎల్ గణేష్, బి.జ్యోతి, ఐ.శైలజ, పి.అనూరాధ, సీఆర్‌పీలు రాజు సరళ, కీర్తి పాల్గొన్నారు. కాగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ డీఈవోను ఏసురత్నం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి బి. హైమారావు, జి.సతీష్‌బాబు, జె.పార్థసారథి, షేక్.అబ్దుల్ ఖలీల్, ఎన్.వేణుగోపాలరావు, పి.సాయి విశ్వనాథ్, పి.లలితబాబు, కె.వీర రాఘవులు, ఏవీ కృష్ణారావు, వెంకటేశ్వరరావు, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతుకు చేరువ కావాలి : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ తేజ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ని ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయం చేరువకావాలని జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ అన్నారు. మంగళవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తాను కూడా గార్డెన్‌లో పీఎండీఎస్ విత్తనాలు వేస్తానని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న రైతు విజయలక్ష్మి అనుభవాలతో ఆయన ఏకీభవించారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామ సంఘాల్లో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అందరు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థక, డీఆర్‌డీఏ శాఖలు కలిసి సమన్వయంతో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రాజకుమారి, ఉద్యానశాఖ జిల్లా అధికారి రవీంద్ర బాబు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మీ, జిల్లా పశు సంవర్థక అధికారి నరసింహారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు



లోకేశ్‌కు శుభలేఖ అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌కు సంబంధించిన అనేక విషయాలను లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. వచ్చే నెల మూడో తేదీన తెనాలిలో జరగనున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కుమార్తె వివాహానికి లోకేశ్‌ని ఆహ్వానించారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

● ఎమ్మెల్సీ ఎస్ లక్ష్మణరావు



యూనివర్సిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేయాలని ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు కోరారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వర్సిటీలో ఉన్న పరీక్ష భవన్, అంబేద్కర్ లైబ్రరీ, పరిపాలన భవన్, దూరవిద్య కేంద్రంతోపాటు పలు కళాశాలల విభాగాలను సందర్శించి ఉద్యోగులను ఓటు వేయాలని అభ్యర్థించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీగా ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలపై పోరాడినట్లు వివరించారు. శాసనమండలిలో గళం విప్పి నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇప్పించినట్లు పేర్కొన్నారు.

ప్రజల గొంతుక లక్ష్మణరావుని గెలిపించాలి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో గత రెండు దశాబ్దాలుగా ప్రజల గొంతుకగా ప్రజావాణిని వినిపిస్తున్న శాసన మండలి సభ్యులు, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుని అఖండ మెజార్టీతో గెలిపించాలని పౌర సంస్థలు విజ్ఞప్తి చేశాయి. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన మంగళవారం కేఎస్ లక్ష్మణరావుతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ శాసన మండలి రాజకీయ పునరావాస కేంద్రం కాకూడదని విద్యావంతుల వేదికగా కొనసాగాలన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ప్రసంగిస్తూ కాంగ్రెస్ శ్రేణులందరూ లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలని కోరారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యమాల చరిత్ర గల కేఎస్ లక్ష్మణరావుని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మిక, కర్షక, అంగన్ వాడీ, ఆశా వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయ రాజనీతి శాస్త్ర ఆచార్యులు వజ్రాల అంజిరెడ్డి నేస్తం వ్యవస్థాపకుడు జలీల్ అహ్మద్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఒ. నారాయణరెడ్డి, మానవత కార్యదర్శి కె.సతీష్, కోశాధికారి టి.వి.సాయిరాం, చంద్రశేఖర్‌రెడ్డి, సెంట్రల్ కస్టమ్స్ పూర్వ ఇన్‌స్పెక్టర్ ఎస్.జకరయ్య, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఆలా అనంతరామయ్య, రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుదత్తు, కార్యదర్శి అవధానుల హరి, స్టెప్ నేత ఆత్మకూరి ధర్మారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోరంట్లలో కోట సాయి కృష్ణ (29) అనే యువకుడు ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయి కృష్ణ సెంట్రింగ్ పని చేస్తుంటాడు. రాజుపాలెం పరిధిలోని ఆర్‌ఆర్ సెంటర్‌కు చెందిన సాయికృష్ణ 9 సంవత్సరాల క్రితం గోరంట్లకు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇరువురు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. అప్పటి నుంచి వారు గోరంట్లలో నివాసం ఉంటున్నారు. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రిపూట గొడవ జరగడంతో ఆమె తన ఇద్దరు పిల్లలను తీసుకొని దగ్గరలో ఉన్న పుట్టింటికి వెళ్ళింది. దీంతో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో సాయికృష్ణ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రత్తమ్మ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్న బీటెక్ విద్యార్థి అరెస్టు

డబ్బు కోసం తన స్నేహితురాలి ఫొటోలు నా వద్ద ఉన్నాయంటూ బయటపెడతాయనని బ్లాక్మెయిల్ చేస్తున్న బీటెక్ విద్యార్థిని అరండల్ పేట పోలీసులు అరెస్ట్ చేశారు. శారదాకాలనీకి చెందిన యువతికి నల్లచెరువుకు చెందిన నితిన్ ఆన్లైన్లో పరిచయం అయ్యాడు. ఇరువురు ప్రేమించుకున్నారు. ఆ సమయంలో నితిన్ ఆమెతో కలిసి దిగిన ఫొటోలను బయట పెడతానని బ్లాక్మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు అందరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార నిర్వాహకుల ముఠా అరెస్టు

స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట శివారు శివరాం నగర్ ఎనిమిదో లైన్లో వ్యభిచారానికి పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలంగా ఓ ఇల్లు అద్దెకు తీసుకొని నగరానికి చెందిన పలువురు యువతులు వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ఆ ఇంటి పై దాడి చేసి ఐదుగురు యువతులు , ఇరువురు యువకులను అరెస్ట్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, పక్కన ఆలపాటి రాజా

సమాజాన్ని సన్మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులే

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సన్మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులేనని, అలాంటి ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమాజహితం కోసం మంచి నిర్ణయం తీసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. గుంటూరు చంద్రమౌళినగర్‌లోని భాష్యం స్కూల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మౌలానా ముస్తాక్ అహ్మద్, మన్నవ మోహన కృష్ణ, కోవెలమూడి రవీంద్ర, సింహాద్రి కనకాచారి, భాష్యం రామకృష్ణలు ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తనకు మద్ధతు ఇవ్వాలని కోరారు. ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని పట్టి పీడించిన జగన్ యువతకు తీరని అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రాష్ట్రానికి 6 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు.

చండీ హోమం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాధవి

పశ్చిమ నియోజకవర్గంలోని సుబ్బారెడ్డినగర్లో ఉన్న పోలేరమ్మ గుడిలో మంగళవారం జరిగిన చండీ హోమం కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యోగ మిత్ర ప్రభుత్వం మాది : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, విద్యావంతులకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని, సీఎం చంద్రబాబు ఉద్యోగుల పట్ల సహృద్భావంతో వ్యవహరిస్తారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గుంటూరు నెహ్రూనగర్‌లోని ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజాను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా అందలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఒకటో తేదీన జీతాలు అందేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ, కార్పొరేటర్ కనకదుర్గ, తూర్పు నియోజకవర్గం అబ్జర్వర్ గంజాం రాఘవేంద్ర, తిలక్, ఆనంద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు

తలసీమియా చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ప్రభుత్వపరంగా అన్ని రకాల వైద్య చికిత్సలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. మంగళదాస్‌నగర్‌లోని నీడ్స్ తలసీమియా బ్లడ్ సెంటర్‌లో తలసీమియా బాధిత చిన్నారులకు ఉచితంగా హెచ్‌ఎల్‌ఏ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, నియంత్రణపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తలసీమియా చిన్నారులకు ఉచితంగా రక్త యూనిట్లు అందిస్తూ చక్కటి సేవలు అందిస్తున్న నీడ్స్ బ్లడ్ బ్యాంక్ సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. నీడ్స్ సొసైటీ అధ్యక్షుడు గూడూరు శ్రీధర్ మాట్లాడుతూ తమ బ్లడ్‌బ్యాంక్‌లో తలసీమియా పిల్లలకు ఉచితంగా రక్తమార్పిడి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, రుక్మిణి, విజయబాబు, ఎస్‌కే షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్


గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి

● టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించిన గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్లపై క్రిమినల్ కేసు పెట్టాలని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుడు అంబటి మురళి గ్రీన్ గ్రేస్ పేరుతో నిబంధనలన్నీ అతిక్రమించి అనుమతి లేకుండా 14 అంతస్తుల భవనాలు నిర్మించడం క్షమించరాని నేరమన్నారు. రైల్వే శాఖ ఇచ్చిన ఎన్వోసీని రద్దు చేసిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగిస్తే కార్పొరేషన్ అధికారులు ఉదాసీనంగా ఉండడం శోచనీయమన్నారు. నిబంధనలన్నీ ఉల్లంఘించి అక్రమంగా నిర్మించిన గ్రీన్ గ్రేస్ ప్లాట్లను అమ్ముకుండా కార్పొరేషన్ అధికారులు ఆపివేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వం కలగజేసుకొని నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన గ్రీన్ గ్రేస్‌ను కూల్చివేస్తే ఎవరు బాధ్యత తీసుకోవాలి, కొనుగోలుదారుల భవిష్యత్తు ఏమిటి? అంటూ ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో బొబ్బిలి రామారావు, షేక్ చిన్నబాజి, హుస్సేన్, యర్రగుంట్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన విధి నిర్వహణ కనపరచాలి

● జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ రమణమూర్తి



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు ఎస్పీ రమణమూర్తి

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని మెరుగైన విధి నిర్వహణను కనపరచాలని జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ కానిస్టేబుళ్లకు ఆయన సర్టిఫికెట్లు అందజేసారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ 30 మంది కానిస్టేబుళ్లు ఈ ఆరు రోజుల శిక్షణ కాలంలో తమకు తెలిసిన విషయాలను గురించి మరింత లోతుగా అవగాహన చేసుకున్నారని, పోలీస్ స్టేషన్‌లో మునుపటి కంటే మరింత మెరుగ్గా సేవలు అందించాలన్నారు. ఆంగ్ల భాషకు సంబంధించిన శిక్షణను సాయిబాబా బోధించగా, కంప్యూటర్ ప్రాథమిక అంశాలకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సైబర్ క్రైమ్స్ గురించి హెడ్ కానిస్టేబుల్ కిషోర్, సీసీటీఎన్ఎస్ గురించి కానిస్టేబుల్ శ్రీనివాస్ బోధించడం జరిగిందన్నారు. శిక్షణ జిల్లా ఐటి కోర్ సీఐ నిస్సార్ బాషా పర్యవేక్షణలో జరుగుతున్నది.

ఆదాయ పన్నుపై అవగాహన కలిగిఉండాలి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను చెల్లిస్తున్న ప్రతి ఉద్యోగి ఎంత, ఎందుకు చెల్లిస్తున్నది సమగ్రంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఇన్‌కంటాక్స్ అదనపు కమిషనర్ ఎన్. సుప్రియ తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఉద్యోగులకు ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ పై ఆ శాఖ అధికారుల ద్వారా మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక సంస్థ సచివాలయ కార్యదర్శుల ద్వారా కూడా ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ సబ్మిట్ చేసేలా చర్యలు తీసుకుంటామ న్నారు. సమావేశంలో ఇన్‌కంటాక్స్ డిప్యూటీ కమిషనర్ ఎన్ఎస్ లలిత, అసిస్టెంట్ కమిషనర్ డి.వేణుగోపాల్, డిప్యూటి కమిషనర్ డి.శ్రీనివాసరావు, సెక్రటరీ పి.శ్రీనివాసరావు, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు సరే.. కళ్లజోళ్లేవి?

● ఉమ్మడి జిల్లాలో 38వేల మంది విద్యార్థులకు కంటి సమస్యలు ● 5,186 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కంటి సమస్యలతో బాధ పడుతున్న విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీపై ప్రభుత్వం స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది సెప్టెంబరులోనే దాదాపు 38వేల మంది విద్యార్థులకు తొలిదశ కంటి పరీక్షలు పూర్తి అయ్యాయి. అయితే వారిలో కళ్లజోళ్ల అవసరం అయిన విద్యార్థుల డేటా ఇప్పటికే జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రభుత్వానికి సమర్పించినా ఇప్పటి వరకు కళ్లజోళ్ల పంపిణీపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కంటి సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు (విద్య),ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల్లో దాదాపు 6.75లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో అనేక మంది పౌష్టికాహార లోపం వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారు లకు ఆదేశాలు జారీ చేసింది. తొలివిడతలో గతేడాది సెప్టెంబరు నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లాలోని 1188 పాఠశాలల్లో 3.08 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దాదాపు 38,008 మంది విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు గు ర్తించారు. వీరిలో తప్పని సరిగా కళ్లజోళ్ల అవసరమైన వి ద్యార్థులు 5,186 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వర లో కళ్లజోళ్ల పంపిణీ చేయడానికి జిల్లా అంధత్వనివారణ, సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గుర్తింపు ఇలా....

పాఠశాలల్లో కంటి సమస్యలతో ఇబ్బందులు పడే విద్యా ర్థులను గుర్తించడానికి సైన్స్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి కొ న్ని పరికరాలు అందజేశారు. సమస్యలు గుర్తించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు. 600 మందికిపైగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించారు. వారు సైతం పరీక్షలు నిర్వహించి డేటాను ప్రభుత్వానికి సమర్పించారు.

కంటి సమస్యలకు ప్రధాన కారణాలు

దృష్టి లోపానికి ప్రధానంగా ఆరు కారణాలను వైద్యులు చెబుతున్నారు. కంటికి దెబ్బ లేదా గాయం ఏర్పడడం, పోషకాహార లోపం, అంటు వ్యాధులు, రసాయనిక చర్య అంటే కంట్లో హానికర మైన ద్రవాలు, రంగులు పడడం, వంశపారపర్యం, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్ సమస్యలు ప్రధాన కారణాలని కంటి వైద్యులు చెబుతున్నారు. మరోవైపు ఇటీవల కాలంలో పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం కూడా విద్యార్థుల కంటి సమస్యలకు కారణమౌతుందని చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అత్యధిక మంది పౌష్టికాహార లోపం, వంశపారంపర్య కారణాల వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కంటి వైద్యు లు చెబుతున్నారు. ప్రాథమిక స్థాయిలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోకుంటే భావిపౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు (పాత చిత్రం)

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులు

ఇండో -ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టైన్

వికసిత్ భారత్‌కు ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వెల్లడి

నకరికల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత దేశం కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఇండో - ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టైన్ తెలిపారు. ప్రపంచంలో భారతదేశ రైతులకు ఒక ప్రత్యేక స్థానం


గుండ్లపల్లిలోని ఇండో - ఇజ్రాయేలు ప్రాజెక్టు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనాలను పరిశీలిస్తున్న ఇండో - ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టైన్

ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండో - ఇజ్రాయేలు భవన నిర్మాణాలను పరిశీలించారు. పాలిహౌస్, షేడ్ నెట్, పాలి టన్నెల్ నిర్మాణాలకు స్థలాన్ని పరిశీలించి, నిర్మాణంలో తీసుకోవలసిన చర్యల గురించి ఇంజనీరింగ్, ఉద్యానవన శాఖ అధికారులకు యూరీ రూబీన్ స్టైన్ దిశా నిర్దేశం చేశారు. రూ. 5.06 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల సాయిల్ వాటర్ ఎనాలసిస్ ప్రయోగశాల, పరిపాలన భవనాలను శిక్షణ పొందే రైతుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్ బ్లాక్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇండో - ఇజ్రాయేలు ప్రాజెక్టు ద్వారా రైతులకు ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రానున్నదని, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను రైతులు పండించే అవకాశం కలుగుతుందని యూరీ రూబీన్ స్టైన్ తెలిపారు. విజన్ 2047 అమల్లో భాగంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ముందు చూపుతో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేసి అమలు చేస్తున్నారన్నారు. రెండు దేశాల భాగస్వామ్యంతో వ్యవసాయ రంగం కొంత పుంతలు తొక్కే అవకాశం ఉందని, రైతులు సమగ్ర అభివృద్ధి సాధించటానికి ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందన్నారు. స్థానిక రైతులతో కలసి ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి రావటంతో అటు రాష్ట్రానికి, దేశానికి మంచి వ్యవసాయ విజ్ఞాన కేంద్రంగా వెలుగొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి, జిల్లా ఉద్యాన వన శాఖ సీహెచ్‌వీ రమణారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ గుంటూరు జిల్లా ఎస్ఈ జీ బ్రహ్మయ్య, సుబ్బ రాయుడు, ఏపీఎంఐపీ పీడీ వీరాంజనేయులు, టెక్నికల్ అధికారి అశోక్‌రెడ్డి, తహసీల్దార్ కే పుల్లారావు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

సుస్థిర విద్యతోనే.. సమసమాజ స్థాపన

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రామరాజు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుస్థిర విద్యయే సమస మాజ స్థాపనకు శ్రేయస్కరం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వీ రామరాజు అన్నారు. సీపీఆర్ ఈఈసీ సీఎస్ఈ, విప్రోయెర్థిన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బైపాస్ రోడ్డులోని సీఎస్ఈ మీటింగ్ హాల్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సుస్థిర విద్యపై ప్రతి ఒక్క రూ దృష్టి సారించాలని అన్నారు. పాఠశాలల్లో సుస్థిర విద్యా విధానాలపై, నీరు, జీవ వైవిధ్యం, చెత్త యాజమాన్యంపై రాష్ట్ర వ్యాప్తంగా 304 పాఠశాలలకు శిక్షణ ఇవ్వగా 80 పాఠశాలలు తమ ప్రాజెక్టులను సమర్పించాయి. 18 ప్రాజెక్టులను జాతీయ స్థాయికి రికమండ్ చేయగా అందులో ఏపీ మోడల్, మహానంది (నంద్యాల జిల్లా), ఎంజేపీఏపీ బీసీఆర్, ఈఐఎస్ కలగిరి (అన్నమయ్య జిల్లా) ప్రాజెక్టులు జాతీ యస్థాయికి ఎంపికై రూ.50వేల నగదు బహుమతు లను గెలుచుకున్నాయి. జడ్పీ హెచ్ మల్లవేలు (కృష్ణా జిల్లా), జడ్పీహెచ్, చెట్టుపల్లి (అనకాపల్లి జిల్లా), అరవింద కుంచనపల్లి (గుంటూరు జిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం వీరవనేని గూడెం (కృష్ణాజిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం (ఆచంట), పెనుగొండ ప్రాజెక్టులు రూ.10వేల బహుమతులు గెలుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాల అవనిగడ్డ (కృష్ణా జిల్లా), మోడల్ స్కూల్, కారంపూడి గురుకులం, సర్వేపల్లి (నెల్లూరు జిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం (పల్నాడు జిల్లా), ఆచంట పశ్చిమగోదావరి జిల్లా, అరవింద మోడల్ స్కూల్ మంగళగిరి (గుంటూరు జిల్లా), ఎంజేపీఏ పీబీసీ, ఆర్ఈఐఎస్ సింహాచలం (విశాఖ), శ్రీ గురురాజ ఇంగ్లీషు మీడియం స్కూల్ (నంద్యాల), డాక్టర్ అంబేద్కర్ గురుకులం జగ్గయ్యపేట (ఎన్టీఆర్ జిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం నూజివీడు (కృష్ణా జిల్లా) పాఠశాలల మొత్తం 18 బృందాలను అభినం దించి రామరాజు సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్య అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీమతి విజయదుర్గ, పలువురు జాయింట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో బెంగుళూరులో జరిగే కార్యక్రమంలో జాతీయ విజేతలైన రెండు బృందాలకు రూ.50వేల నగదు విప్రో సంస్థ బహూకరిస్తుందని ప్రాజెక్టు కోఆర్డినేట్ డైరెక్టర్ వెంకటరత్నం తెలిపారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రామరాజు

అబద్ధాలు చెప్పడంలో జగన్ పీహెచ్‌డీ

-మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అబద్ధాలను కూడా కాన్ఫిడెంట్‌గా చెప్ప డంలో జగన్మోహన్‌రెడ్డి పీ హెచ్‌డీ చేశారని, గన్నవరంలో టీడీపీ కార్యాలయం దాడిపై జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారు అనే భ్రమలోంచి ఇకనైనా జగన్ బయటకు రావాలని ఆయన అన్నారు. దళిత ఉద్యోగి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి హింసించి, హత్య చేస్తానని బెదిరించిన వైసీపీ నేత వంశీని విజయవాడ జైలులో పరామర్శించిన జగన్, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలు జరిగినప్పుడు ఏం చేశారని నిలదీశారు. ఒక దుర్మార్గుడిని పరామర్శించడానికి జైలుకు వెళ్లిన జగన్మోహన్‌రెడ్డి, అక్కడ కూడా కులాల గురించి మాట్లాడటం నీచాతి నీచమన్నారు. మనిషి అనే వాడు చేయని దుర్మార్గాలు వల్లభనేని వంశీ చేయబట్టే నేడు జైల్లో ఉన్నాడని చెప్పారు. రౌడీలు, గుండాలకు వత్తాసు పలుకుతున్న జగన్, నేరస్థులకు మద్దతిస్తూ పోలీసుల బట్టలు విప్పతీస్తాం అంటూ మీడియా ముందు రంకెలు వేయడం చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా కేటాయింపులు

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే సాధ్యం ◆ చర్చాగోష్టిలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాబడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా కేటాయింపులు జరిగినట్లు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కేంద్రబడ్జెట్‌పై స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం మేధావులతో చర్చాగోష్టి జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుప తిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వలనే కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక కేటాయింపులు సాధ్యమయ్యాయన్నారు. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని అందుకు అనుగుణంగానే బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ప్రధాని మోదీతోనే వికసిత భారత్ సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి రూ2,50,000 కంటే మించిన ఆదాయంపై పన్ను వసూలు చేసిందన్నారు. మోదీ ప్రభు త్వం 12 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను సడలింపు చేసిందన్నారు. దీనివల్ల కేంద్రానికి పన్నుల రూపంలో రూ.1.04 లక్షల కోట్ల ఆదాయం తగ్గుతున్నా మధ్యతరగతివర్గాల శ్రేయస్సు కోరి మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రైతులకు అండగా ఉండేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులపై రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం పెం చడం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగాలు కాకుండా స్టార్టప్‌ల ద్వారా నిధులు కేటాయిస్తుందని, ఒక్కో యూనిట్‌కు రూ.10 కోట్లకు రుణాలను పెంచినట్లు తెలిపారు. 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య యోజన కింద రైతుల కోసం 1.7 కోట్ల మందితో ప్రయోగాత్మక పథకం ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల రైతుకు విత్తనం నుంచి పంట పండిన తర్వాత మార్కెటింగ్ సదుపాయం కల్పించేంత వరకు కేంద్రం అండగా నిలుస్తుందన్నారు.

అమరావతికి ప్రత్యేక నిధులు..

బడ్జెట్‌లో గత వైసీపీ పాలనలో లేనివిధంగా అమరావతి, పోలవరం ప్రాజెక్టుకి ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. గతంలోనే అమరావతిని స్మార్ట్ సిటీగా ప్రకటించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు దశల వారీగా నిధులు కేటాయించామన్నారు. విశాఖ పోర్టుకి రూ.730 కోట్లు కేటాయింప చేశారన్నారు. గత 5 ఏళ్లలో రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తద్వారా రాష్ట్రాన్ని అనాథాంధ్ర ప్రదేశ్‌గా తయారు చేశారన్నారు. నేడు చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి దిశగా ప్రాజెక్టులు, పెట్టుబడులను తీసుకు వస్తున్నారన్నారు. బడ్జెట్‌కి ముందు సీఎం స్వయంగా కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి సమస్యలను వివరించి పెద్దమొత్తంలో నిధులు రాబట్టగలిగారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, గళ్లా మాధవి, ఎండీ నసీర్ అహ్మద్, బూర్ల రామంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జాతీయకౌన్సిల్ మెంబర్ జూపూడి రంగరాజు, మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, చందు సాంబశివరావు, ఈదర శ్రీనివాస్‌రెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, కొక్కెర శ్రీనివాసరావు, పాలపాటి రవికుమార్, కొత్తూరి వెంకట సుబ్బారావు, నేరెళ్ల మాధవరావు, చరక కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్‌పై చర్చాగోష్ఠిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, మాధవి తదితరులు

కృష్ణబాబు చెబితే.. మాకేంటి!

● ఆరోగ్య శాఖలో అడ్డగోలు డిప్యుటేషన్లు ● ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలకు పాతర ● పని ఉన్న చోట నుంచి తెచ్చి పని లేని చోట ఉద్యోగం ● వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వారిని అదే చోట ఉంచారు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్ అంటే రోగుల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. అటువంటి చోట ఉద్యోగులకు పని ఎక్కువగా ఉంటుంది. అక్కడ పనిచేస్తున్న ఒక ఫార్మసిస్ట్‌ను తీసుకువచ్చి బొత్తిగా పనిలేని జిల్లా కార్యాలయంలో ఉంచారు. అదేమంటే అప్పట్లో ఎవరో వైసీపీ నేత చెప్పాడని డిప్యూటేషన్ వేసినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం మారినా సదరు ఉద్యోగి డిప్యుటేషన్ అంతే కొనసాగుతూనే ఉంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఇలా అక్రమ డిప్యుటేషన్ల దందా నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఆరోగ్యశాఖ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే ప్రజలకు అంతో ఇంతో మేలు జరుగుతుంది. అధికారులకు మాత్రం అవేవీ పట్టవు. గ్రామాల్లో సిబ్బంది కొరతగా ఉన్నా అక్కడ పనిచేసే వారిని అసలు పనేలేని జిల్లా కార్యాలయంలో నియమిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ప్రిన్సిపల్ సెక్రటరీ చెప్పినా...

వైద్యఆరోగ్యశాఖలోని అన్ని డిప్యుటేషన్లు రద్దు చేయమని ప్రిన్సిపల్ సెక్రటరి కృష్ణబాబు ఆదేశాలు జారీచేశారు. గత ఏడాది ఏప్రిల్‌లోనే ఈ ఆదేశాలు జిల్లా కార్యాలయానికి అందాయి. అప్పట్లో కొద్ది మందిని జీతం తీసుకుంటున్న ప్రదేశానికి పంపివేశారు. కొంతమందిని మాత్రం వివిధ కారణాలతో డిప్యుటేషన్ వేసిన స్థానంలోనే కొనసాగించారు. జిల్లా కార్యాలయంలో సిబ్బంది కొరత పేరుతో ఆరోగ్య పర్యవేక్షకులను డిప్యుటేషన్లు వేయటం వివాదాస్పద మవుతుంది.

ఎన్నో ఏళ్లుగా అక్కడే...

వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో ఒక హెల్త్ సూపర్వైజర్ పని చేస్తున్నారు. వాస్తవానికి సదరు సూపర్వైజర్ వేరే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీతం తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయన అక్కడే వుంటున్నారు. అదేమనంటే ఇమ్యునైజేషన్ విభాగంలో సిబ్బంది కొరత అని చెబుతున్నారు. ఇదే విభాగంలో మరో సూపర్వైజర్,హెల్త్ అసిస్టెంట్ కూడా పనిచేస్తున్నారు. వీరంతా వేరే చోట జీతాలు తీసుకుంటూ కడుపులో నీళ్లు కదలకుండా జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

వైసీపీ వాళ్ళు చెప్పారని...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో చాలామంది ఉద్యోగులు డిప్యుటేషన్ల మీద కొనసాగుతున్నారు. వారంతా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నేతల సిఫార్సు తో అక్కడకు వచ్చిన వారే. ప్రభుత్వం మారినా ఉద్యోగులు మాత్రం అదే స్థానంలో కొనసాగుతున్నారు. ఉదాహరణకు పెదనందిపాడు ఆరోగ్య కేంద్రంలో అసలు డీఈవో పోస్టు లేదు. అక్కడ ఉన్న వైసీపీ నేత ఒత్తిడితో గుంటూరు అర్బన్‌లో పనిచేస్తున్న ఉద్యోగిని పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నియమించారు. ప్రిన్సిపల్ సెక్రటరి కృష్ణబాబు ఆదేశాలు జారీచేసిన తర్వాత కూడా వాళ్లను యథాస్థానానికి పంపకపోవటం గమనార్హం. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కూడా కొందరు ఉద్యోగులు ఇదే పద్ధతిలో కొనసాగుతున్నారు.


గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం

పట్టణాలు వదలరు..

ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు సుదీర్ఘ కాలం సర్వీసు పూర్తి చేసినా ఏనాడూ గ్రామీణ ప్రాంతం వెళ్లిన దాఖలాలు లేవు. ఉద్యోగంతో పాటు పట్టణంలో వ్యాపారాలు చేస్తుండటంతో బదిలీ వచ్చినా వెంటనే డిప్యుటేషన్లు వేయించుకుంటున్నారు అన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం జరిగిన హెల్త్ అసిస్టెంట్‌లు రీ డిప్లాయిమెంట్‌లో కూడా అదే జరిగింది. పట్టణ ప్రాంతాల్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్‌లు ఒక గ్రూపుగా ఏర్పడి అప్పటి మంత్రి సిఫార్సుతో అనుకూలంగా ఉన్న 40 పోస్టులను బ్లాక్ చేయించారు. సదరు ఉద్యోగులు జాయిన్ అయ్యి 20 సంవత్సరాలు దాటినా పట్టణంలోనే పనిచేస్తూ ఉండటం గమనార్హం. డిప్యుటేషన్ల కోసం జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక లాబీయింగ్ నిరంతరం జరుగుతూనే వుంటుందని వైద్య ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు. అక్రమ డిప్యుటేషన్లపై ఫిర్యాదు చేసేందుకు కొందరు ఉద్యోగులు సిద్ధమయ్యారు.

సాగర్ ఆయకట్టులో వారబందీ అమలుకు నిర్ణయం

కాలువల వారీగా పంటల వివరాలు సేకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడి కాలువ ఆయకట్టులో వారబందీ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు కాలువల వారీగా పంటల సాగు.. నీటి సరఫరా అంశా లను పరిశీలిస్తున్నారు. నీటి విడుదలపై నియం త్రణ ఏదీ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జలవనరుల శాఖ సీఈ శ్యాం ప్రసాద్ స్పందించారు. గుంటూరు సీఈ కార్యాలయంలో కుడి కాలువ పరిధిలోని ఈఈలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నీటి సరఫరాపై ఆయన సమీక్షించారు. ఏ కాలువ పరిధిలో ఏఏ పంటలు సాగులో ఉన్నాయి. పంటలకు ఎప్పటి వరకు సాగునీరు అవసరం ఉంది అన్న అంశాలపై సీఈ నివేదిక అందజేయాలని కోరారు. నీటి సరఫరాను తగ్గించే అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. కాగా కుడి కాలువకు నీటి సరఫరాపై సమీక్షించేందుకు పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు సదరు అధికారులు తెలిపారు. సమావేశానికి ఇంజనీర్లు హాజరవుతున్నట్లు చెబుతున్నారు. సమావేశానికి ప్రాజెక్టు కమిటీ.. డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఆహ్వానించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కుడి కాలువకు నీటి సరఫరాపై నిర్వహించే సమావేశంలో సదరు కమిటీలను భాగస్వాములను చేయడంలేదన్న వాదన వినిపిస్తోంది.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

హోటళ్లలో వాణిజ్య సిలిండర్లు మాత్రమే వాడాలి

మేడికొండూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హోటళ్లు, రెస్టారెంట్‌లతో పాటు దుకాణాలలో సబ్సిడీ సిలిండర్లులు వాడవద్దని, తప్పనిసరిగా వాణిజ్య సిలిండర్లు మాత్రమే వాడాలని తహసీల్దార్ ఎం. హరిబాబు స్పష్టం చేశారు. పేరేచర్ల జంక్షన్‌లో మంగళవారం తహసీల్దార్ హరిబాబు వాణిజ్య దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పశ్చిమ డెల్టాకాల్వకు నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 80, రేపల్లెకాల్వకు 150, తూర్పుకాల్వకు 187, పశ్చిమకాల్వకు 70, నిజాంపట్నంకాల్వకు 60, కొమ్మమూరుకాల్వకు 693 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ఫిరంగిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నుదురుపాడులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ఈసీసీఈ బలోపేతం చేయటం కోసం డీఆర్‌పీ చంద్రశేఖరరెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకుమాను, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్తిపాడు సీడీపీవో సుజాతదేవి మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు సమన్వయంతో పని చేసి విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీలు కృషి చేయాలని సూచించారు.

చిన్నారులకు ఆధార్ కార్డులు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కార్డులు లేని ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు నూతన కార్డులను జారీ చేయటానికి ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో ఎస్ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. స్కూళ్ళు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్లో చదువుకొనే విద్యార్థులకు ఈ క్యాంపుల్లో ఆధార్ తీయించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు క్యాంపులు జరుగుతా యన్నారు.

పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలో మంగళవారం రాత్రి పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. పలు ప్రాంతాలకు వెళ్లి అనుమానాస్పద వ్యక్తులపై ఆరా, బహిరంగంగా మద్యం తాగే వారిని, వీధుల్లో తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించేవారిని హెచ్చరించారు. సీతానగరం పుష్కరఘాట్ల వద్ద, కృష్ణానది తీరంలోనూ పెట్రోలింగ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు వస్తే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జేఎస్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా కెనాల్ కేఎం నెం.425/3-5 వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు మంగళవారం తెల్లవారుజామున కనుగొన్నారు. మృతుడి వయస్సు సుమారు 25-30 సంవత్సరాలు ఉంటాయని గ్రీన్ కలర్ టీషర్టు, ఎరుపురంగు షార్ట్ ధరించి ఉన్నాడని, 5.2 అడుగుల ఎత్తు ఉన్నాడని మృతుడి వివరాలు తెలియరాలేదని గుంటూరు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహం జీజీహెచ్ గుంటూరులో ఉందని వివరాలు తెలిసినవారు సీఐ అంజిబాబు 9440627546, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు 9440790522 నెంబరులో సంప్రదించాలని కోరారు. గుంటూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇసుక లారీలు

తుళ్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓవర్ లోడుతో వెళుతున్న ఐదు ఇసుక లారీలను పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం హౌసింగ్ స్కీం కోసం లింగాయపాలెం రీచ్ నుంచి గుంటూరుకు ఓవర్ లోడుతో వెళుతున్న ఇసుక లారీలను పట్టుకొని జరిమానా విధించినట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ అవసరాలకైనా రాత్రుళ్లు ఇసుక రవాణా నిషేధం అయినప్పటికి లారీలు వెళుతుండటం గమనార్హం. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత ఇసుక విధానం ప్రవేశపట్టింది. ట్రాక్టర్లకు మాత్రమే మనుషులతో ఇసుకను లోడు చేసి తీసుకెళ్లవచ్చని తెలిపింది. దీంతో ఇసుక చౌకగా అందుబాటులోకి వచ్చింది. దీంతో డిమాండ్ కూడా తగ్గింది.

రాయలసీమ యూనివర్సిటీ వీసీగా బసవరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని రాయలసీమ విశ్వ విద్యాలయం ఉపకులపతిగా మంగళగిరికి చెందిన డాక్టర్ ఉడతా వెంకట బసవరావును నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చేనేత సామాజిక వర్గానికి చెందిన బసవరావు ఉస్మానియా యూనివర్సిటీ కెమికల్ ఇంజనీరింగ్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన మూడేళ్లపాటు రాయలసీమ యూనివర్సిటీ వీసీగా కొనసాగనున్నారు. బసవరావు నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్‌కు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్య మనుగడకు ఓటు కీలకం

- జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ
- ఎమ్మెల్సీ ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ
- అధికారులు, ఉద్యోగులు, ఓటర్లతో ప్రతిజ్ఞ



మంగళగిరిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడం కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం పట్టణంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గాలిగోపురం వద్ద నుంచి మిద్దె సెంటరు వరకు ఈ ర్యాలీ జరిగింది. జేసీ భార్గవ్ తేజ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవడంతోపాటు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తద్వారా ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణంలో పాలుపంచుకోవాలని కోరారు. తొలుత గాలిగోపురం వద్ద ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులచే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 27వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గాబాయి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు, మంగళగిరి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎ.లక్ష్మీకుమారి, తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీకాంత్, ఎంపీడీవో టీ.సుగుణమ్మ, దుగ్గిరాల తహసీల్దారు సునీత, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి


రీసర్వే రిపోర్ట్‌లను పరిశీలిస్తున్న జేసీ భార్గవతేజ

తుళ్లూరు,(వడ్డమాను)18:(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో జరుగుతున్న సర్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజ సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం తుళ్లూరు మండల పరిధిలోని వడ్డమాను గ్రామంలో చేపడుతున్న భూ రీసర్వే పనులను ఆయన సందర్శించారు. తదుపరి రీ సర్వే బ్లాక్ బౌండరీ సరిహద్దును పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్వేయర్లకు, రెవెన్యూ అధికారులకు రీసర్వే మీద తగు సూచనలు చేశారు. సర్వేప్రక్రియ త్వరతగతిన పూర్తయ్యేటట్లు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వే సహాయక సంచాలకులు (ఏడీ)డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, గ్రామ, మండల సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దుగ్గిరాల పీహెచ్‌సీలో రాష్ట్ర లెప్రసీ విభాగ జేడీ తనిఖీ

దుగ్గిరాల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుగ్గిరాలలోని ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రాన్ని రాష్ట్ర లెప్రసీవిభాగ సంయుక్తసంచాలకుడు డాక్టర్ దేవసాగర్ మంగళవారం సందర్శించారు. మండలంలోని దుగ్గిరాల పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జరిగిన కుష్టువ్యాధి కేసులపై జరిగిన సర్వేరు సంబంధించి రికార్డులను తనిఖీచేశారు. గతంలో కేవలం ఆరు కేసులు ఉన్నాయని, ఇటీవల జరిగిన సర్వేలో కొత్తగా కుష్టువ్యాధి లక్షణాలను మొత్తం 65 మందిలో గుర్తించారని, కొత్తగా ఒకరికి మాత్రమే వ్యాధి సోకినట్లు గుర్తించినట్లు డాక్టర్ ఇందిర జేడీకి వివరించారు. వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. డీపీఎంవో శ్యామ్, సీహెచ్‌వో జానమ్మ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు వేదికగా హ్యాకథాన్

మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డాక్టర్ పెరుమాళ్ళు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలకు, ఆయా ఆవిష్కరణల్లో నైపుణ్యం సాధించేందుకు హ్యాకథాన్‌లు వేదికగా నిలుస్తున్నాయని మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మల్లినేని ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 17, 18 తేదీల్లో రెండవ సంవత్సరం సాంకేతిక విద్యార్థినుల కోసం కృత్రిమ మేథస్సు, రోబోటిక్స్‌పై నిర్వహించిన 36 గంటల హ్యాకథాన్ మంగళవారం ముగిసింది. హోక్‌బోర్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రానికి మిస్టర్ కేకే కంపెనీ సీఈవో కె.కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ హ్యాకథాన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ జి.శ్రీనివాస్ కుమార్, ఐటీ విభాగాధిపతి డాక్టర్ కె.సునీత, వివిధ విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.


స్వామివార్లను దర్శించుకుంటున్న భక్తులు

పెండ్లి కుమారుడి అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి

మంగళగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 18 నుంచి 27వ తేదీ వర కు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల్లో భా గంగా తొలి రోజైన మంగళవారం స్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. గణపతి పూజ, పంచా మృతాభిషేకం అనంతరం పెండ్లి కుమారుడి ఉత్సవం నిర్వహించారు. శివాలయం ప్రధాన అర్చకుడు తెలి దేవరపల్లి మహేష్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ ఉత్సవానికి జంజనం నాగేంద్రరావు, విజయలక్ష్మీ దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. మంగళవారం రాత్రి వీదుల్లో గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో శివాలయం కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణరావు, బీ కోటేశ్వరరావు, వీ మంగారావు, కే బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ వ్యవసాయ విద్యార్థుల 'టెక్నిక్స్'


విద్యార్థులు గీసిన వ్యవసాయ పంటల చిత్రాలు

తాడేపల్లి (ఇప్పటం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో సోమవారం సాయంత్రం కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు టెక్నిక్స్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వేస్తున్న పంటలపై, వారు తీసుకునే జాగ్రత్తలపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన టెక్నిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల వద్దకు వెళ్లి రైతులు ఏ విధంగా సేద్యం చేస్తున్నారు, ఏయే పంటలు వేస్తున్నారు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి సంబంధించిన వ్యవసాయ భూమి పంటలు, నీటి వసతి గ్రామ స్వరూప చిత్రపటాన్ని పలు వ్యవసాయ పంటల చిత్రపటాలను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ఇప్పటం గ్రామంలోని రామాలయం వద్ద వ్యవసాయ కళాశాల విద్యార్థులు వేసిన వ్యవసాయ పంటల చిత్రాలు రైతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేఎల్ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ రత్న ప్రసాద్, హెచ్‌వోడీ బాలకృష్ణ, రాజేశ్వర్, అవినాష్, ఉదయ్ భాస్కర్, విద్యార్థులు, విష్ణుప్రియ, ఖాజాబి, కావ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు శంకరశెట్టి పిచ్చయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నేత వెంకటరెడ్డి

ప్రజల పక్షాన పోరాడే లక్ష్మణరావును గెలిపించండి

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడి పనిచేసే కెఎస్ లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించాలని సీపీఎం తాడేపల్లి రూరల్ మాజీ కార్యదర్శి, సీఐటియూ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో ప్రజాసంఘాల నేతలతో కలసి లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు.కార్యక్రమంలో సీపీఎం రూరల్ కార్యదర్శి పల్లె కృష్ణ, కేవీపీఎస్ నేతలు ఎన్ విజయం టాజు, సీఐటియూ నేతలు ఎస్‌కె గన్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): కృష్ణా,గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా మండలంలోని పెనుమూలి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులకు ఇండ్లకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. శాసనమండలిలో ప్రజల గొంతు వినిపించేందుకు లక్ష్మణరావుకు ఓటువేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం కొనసాగించారు. ప్రజాసంఘాల నాయకులు రైతుసంఘం మండలకార్యదర్శి జెట్టి బాలరాజు, మండల కౌలురైతుసంఘ అధ్యక్షుడు భీమవరపు అమ్మిరెడ్డి, రైతుసంఘం మండల కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు(పాలపర్రు),(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రజాసంఘాలు బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా మండల పరిధిలోని పాలపర్రులో మంగళవారం ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజా, విద్యారంగ సమస్యల పరిష్కారానికి లక్ష్మణరావు కృషిచేస్తారని పేర్కొన్నారు. తమ మొదటి ప్రాధాన్యత ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, జంపని రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఇంగ్లీషు భాషా ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఘనంగా భాషా పండుగ

దుగ్గిరాల, ఫిబ్రవరి 18: దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొలిరోజు భాషా పండుగ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఆంగ్లభాషలో పలు అంశాలకు సంబంధించిన విద్యార్థినులు ప్రదర్శించిన ప్రాజెక్టుల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఆంగ్లంలో వక్తృత్వ పోటీలు, పాటలు, రైమ్స్ పాడి ప్రతిభ చాటిన వారందరికీ పెన్నులను పంపిణీ చేశారు. 19వ తేదీ గురువారం సంస్కృతం, హిందూ, ఉర్దూ భాషలపై, 20వ తేదీ గురువారం తెలుగుభాషపైన పలుపోటీలను నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం శోభాదేవి తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నేతలు పనిచేయాలి

పెదనందిపాడు, ఫిబ్రవరి, 18 (ఆంధ్రజ్యోతి) : పార్టీ అధిష్టాన ఆదేశాలకనుగుణంగా నాయకులు పనిచేయాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పీఏఎస్ కాలేజీ రోడ్డునందు మంగళవారం టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి గెలుపుకు కృషిచేయాలన్నారు. గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి గత ఎనిమిది నెలల్లో కూటమి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధిని తెలియజేసి, ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, నియోజకవర్గ పరిశీలకులు భీమినేని వందనాదేవి, నాయకులు దివ్వి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంతో రైతులకు మేలు

- రైతు నేస్తం ఫౌండేషన్ సీఈవో సాంబశివరావు
- విద్యార్థినులకు డ్రోన్ పనితీరుపై అవగాహన


విద్యార్థినులకు డ్రోన్ పనితీరుని వివరిస్తున్న డ్రోన్‌ల పైలెట్ గోపీనాథ్, సీఈవో సాంబశివరావు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ వినియోగంతో రైతులకు ఎంతో మేలు ఉంటుందని, ముఖ్యంగా పురుగు మందు పిచికారీలో కూలీల కొరతను డ్రోన్ భర్తీ చేస్తుందని రైతునేస్తం ఫౌండేషన్ సీఈవో సాంబశివరావు అన్నారు. పుల్లడిగుంట సమీపంలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో మంగళవారం వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం బీఆర్ పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొని వ్యవసాయంలో డ్రోన్ వినియోగాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. డ్రోన్ పైలెట్ గోపీనాథ్ డ్రోన్ వినియోగం, పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే వర్మికంపోస్టు యూనిట్, గోశాల, ఘన జీవామృతాల తయారీ విధానం, ఎద్దు గానుగ ద్వారా నూనె తీసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో పీఆర్ పాలిటెక్నిక్ ఆఫ్ ఎగ్రికల్చర్ కళాశాల, సిబ్బంది ఎం ప్రవీణ్ నాయుడు, సీహెచ్.నరేంద్ర, ఎన్.అఖిలేశ్వరి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి, పక్కన ఎమ్మెల్యే బూర్ల

పార్టీ కోసం ఎమ్మెల్యే స్థానాన్ని వదులుకున్న ఆలపాటి

- ఎమ్మెల్సీగా ఆయనను గెలిపించి మండలికి పంపుదాం
- నియోజకవర్గ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు
- ఎమ్మెల్యే బూర్లతో కలిసి ఎన్నికల ప్రచారం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో పార్టీ కోసం ఎమ్మెల్యే స్థానాన్ని వదులుకున్న వ్యక్తికి డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని, ఇందుకుగాను సీఎం చంద్రబాబునాయుడు ఆయనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారని, రానున్న ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించి మండలికి పంపించి గౌరవిద్దామని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ కూటమి నాయకులతో ఎమ్మెల్యే బూర్ల రామాంజేయులు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సోమిశెట్టి మాట్లాడుతూ.. ఆలపాటి గెలుపు కోసం ప్రతి ముప్పై ఎమ్మెల్సీ ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ముప్పై మందికి నియమితులైన ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఓటర్లతో టచ్‌లో ఉండాలని, ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, జనసేన పరిశీలకులు కమల్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కుర్రి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను (ఆంధ్రజ్యోతి): కాకుమాను టీడీపీ మండల మండల కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, మహిళలు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యా సంస్థలు దెబ్బతిన్నాయన్నారు. ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి గెలుపొందితే అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి, కొల్లా వీరయ్య చౌదరి, అగస్టీన్ బాబు, మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, పెద్ది రవీంద్రబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మేడికొండూరు,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మేడికొండూరు మండల పరిధిలోని పలు విద్యాసంస్థల్లో ఆలపాటికి మద్దతుగా మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కలసి ఆలపాటిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త బేతపూడి విజయశేఖర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాములపాటి శివన్నారాయణ, ఫిరంగిపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి, (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి తరపున పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ మంగళవారం కూటమి నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని సీకే బాలికోన్నత పాఠశాల, ఆత్మకూరు బాపూజీ విద్యాలయాలకు వెళ్లి ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓట్లను వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకటమారుతీరావు, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు కొదమల సైమన్, పడమట రాధాకృష్ణ, దుర్గా నాయక్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తుళ్లూరులో కూటమి నేతలు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్లను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాదుకి ప్రథమ పాధాన్య ఓటు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఓటర్ల ఇంటింటికి తిరిగి కరపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు బండ్ల పట్టాభిరామయ్య, బూత్ కన్వీనర్ కంతేటి బాబు, నాయులు జమ్ముల అనిల్, ఆమర్తి వెంకట్రావు, గూడపాటి శ్రీకాంత్, జమ్ముల హరికిరణ(బాబి) బండ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వంశీని పరామర్శించడం దుర్మార్గం

తాడేపల్లి (కొలనుకొండ), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జగన్ దళిత వ్యతిరేకి అని మరోసారి రుజువైందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ వ్యాఖ్యానించారు. వల్లభనేని వంశీ ఎన్నో అరాచకాలు చేసి దళితులను వేధించి హింసించాడని తెలిసి కూడా మాజీ సీఎం జగన్ వంశీని జైలుకు వెళ్లి పరామర్శించడం సిగ్గుచేటన్నారు. మండలంలోని కొలనుకొండలో రమేష్ విలేకరులతో మాట్లాడుతూ జగన్ హయాంలో ఐదేళ్లు తెలుగుదేశం నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించి జైలుకు పంపినప్పుడు జగన్‌కు గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. జగన్ నేరగాళ్లకు నాయకుడని అందుకనే నేరయాత్ర చేశారని ఆరోపించారు. జైలులో వంశీని ఏమని పరామర్శించారో ప్రజలకు చెప్పాలని రమేష్ డిమాండ్ చేశారు. జగన్‌రెడ్డి జైలు యాత్రలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. నేరస్తులకు అండగా జగన్ నిలుస్తున్నారని వెంటనే దళితులకు క్షమాపణ చెప్పాలని రమేష్ డిమాండ్ చేశారు. దళితులను హింసించిన వంశీని ఏ ముఖం పెట్టుకుని జగన్ పరామర్శించాడని రమేష్ ప్రశ్నించాడు.

21న కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

- నేటి నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభం

తాడికొండ (నిడుముక్కల) ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిడుముక్కల గ్రామ శివారులోని పెయ్యలమిట్ట వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 21న కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చేపట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 21వ తేదీ ఉదయం 11.54 నిమిషాలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. చుట్టు పక్కల గ్రామాల్లో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

తాడికొండ(లాంఫాం)ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేవీకే అధిపతి డాక్టర్ కే.ఎం. యుగంధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. పుట్టగొడుల పెంపకాన్ని 3 రోజులకు రూ. 1500, 6 రోజులకు రూ. 3,000, 10 రోజులకు రూ. 5,000 ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు లాంఫాంలోని కేవీకే శాస్త్రవేత్తలను సంప్రదించాలని సూచించారు.

చెరువు కట్ట అభివృద్ధి పనులు ప్రారంభం

తాడికొండ (పాములపాడు)ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాములపాడు గ్రామంలోని చెరువు కట్ట అభివృద్ధి పనులను మంగళవారం సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ ప్రారంభించారు. చెరువు కట్ట చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, కట్టను బలోపేతం చేయటానికి మట్టిని సరిచేశారు. చెరువును శుభ్రంచేసి వచ్చే వర్షాకాలంలో పుష్కలంగా నీటిని నిల్వచేసుకొని నీటి ఎద్దడి లేకుండా చూస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చెరుకూరి నరేంద్ర, కాట్రగడ్డ శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కాట్రగడ్డ రంగారావు, గ్రామస్థులు పలువురు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు వల్లభాపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

● ఏఈ ప్రదీప్‌కుమార్

కొల్లిపర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నంగి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వల్లభాపురం ఫీడర్ పరిధిలో అత్తలూరిపాలెం, వల్లభాపురం గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వ సంస్థలకు నోటీసులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలలో పెద్ద ఎత్తున ఆస్తి పన్ను బకాయిలు ఉన్న నేపథ్యంలో పన్ను వసూళ్లకు నోటీసులు జారీ చేసినట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు మంగళవారం తెలిపారు. నిడుబ్రోలులోని మత్స్యశాఖ రూ.21.90లక్షలు, తహసీల్దార్ కార్యాలయంలో రూ.21.80లక్షలు, పంచాయతీరాజ్ కార్యాలయం రూ.16.52 లక్షలు, ఆర్ అండ్ బీ శాఖ 16.55 లక్షలు, పోలీసు క్వార్టర్లు రెండు బ్లాక్‌లు కలిపి రూ.8 లక్షలు, ఎస్ఐ క్వార్టర్స్ రూ.3.47లక్షలు, ఎంపీడీవో కార్యాలయం రూ.5.17 లక్షలు, నీటిపారుదల శాఖ రూ.7లక్షలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూ.2.82 లక్షలు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నట్లు తెలిపారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని నోటీసుల ద్వారా కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, రూ.1.10 కోట్ల ఆస్తి పన్ను బకాయి ఉన్నట్లు తెలిపారు.

బాత్రూమ్‌లో పడి వ్యక్తి మృతి

● ఆలస్యంగా గుర్తింపు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వరపేట రాజుల కాలనీలో ఓ వ్యక్తి బాత్రూమ్‌లో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు రాజుల కాలనీలో సొంత ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్న దామర్ల సూర్యప్రకాష్ (55) బాత్రూమ్‌లో పడి చనిపోయాడు. కొద్ది రోజులుగా బాత్రూమ్ నుంచి దుర్వాసన వస్తుండటంతో అనుమానించిన ఇంటి పక్కన నివాసం ఉంటున్నవారు వెళ్లి పరిశీలించగా సూర్యప్రకాష్ మృతి చెంది ఉండటం గుర్తించారు. మృతుని భార్య, కుటుంబ సభ్యులు వివాదాల కారణంలో ఇతర ప్రాంతాలలో నివాసం ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భావనగర్ కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిర 20వ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. షిర్డి సాయి సేవా మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా మూల విరాట్‌కు 18రకాల అభిషేకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మందిర నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

శతాధిక వృద్ధురాలు మృతి


కొల్లి కాంతమ్మ

కొల్లిపర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో శతాధిక వృద్ధురాలు కొల్లి కాంతమ్మ (105) సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. కాంతమ్మ భర్త కొల్లి సుబ్బారెడ్డి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటున్నారని అనాటి బ్రిటీషు పోలీసులు వీరి ఇంటిపై దాడిచేసి ఆస్తులను ధ్వంసం చేశారు. స్వాతంత్ర్యం ఉద్యమంలో పాల్గొని సుబ్బారెడ్డి జైలు జీవితం గడిపాడు. కాంతమ్మకు ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలతో పాటు మనుమలు, మనుమరాళ్లు, ముదిమనవలు ఉన్నారు.

వైభవంగా శ్రీ కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

కొల్లిపర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శివారు గుదిబండి వారిపాలెంలో మంగళవారం శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారు జాము నుంచి పూజలు నిర్వహించారు. పండితులు కుమారస్వామి, పోగుల రామలింగేశ్వరశర్మలు అమ్మవారికి వివిధ అభిషేకాలు నిర్వహించి విష్వక్సేనపూజ, పుణ్యాహవచన, విశేష ఆరాధన పూజలు నిర్వహించారు. అమ్మవారి వార్షికోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120రోజుల జ్ఞానజ్యోతి కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఆర్‌పీలు మృత్యుంజయరావు, రాధిక, శ్రీలత, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక కొత్తపేటలోని స్టేట్ గవర్నమెంటు పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్టేట్ గవర్నమెంటు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిలుగా పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తహసిల్దార్ గోపాలకృష్ణలు పాల్గొని ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటును వినియోగించుకోవాలని అన్నారు. గ్రాడ్యుయేషన్ అర్హతతో దరఖాస్తు చేసిన వారందరికీ ఓటు హక్కు కల్పించడం జరిగిందన్నారు. ఇంటి నెంబరు ఆధారంగా వారికి సమీపంలోని ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లకు కేటాయించామని ఇప్పటికే ఓటర్ల జాబితాలను ప్రదర్శించామని చెప్పారు. దరఖాస్తు చేసిన వారు తమ ఓటును పరిశీలించుకోవచ్చని ఎన్నికల కమిషనర్ ఆన్‌లైన్ యాప్‌ను కూడా విడుదల చేసిందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ విధానం ద్వారా అభ్యర్థిని ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. ఓటు వేసేందుకు వెళ్లేవారు తమ వెంట ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డును వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల పేర్లు రాజకీయ పార్టీ పేరు ఉంటుందని ఓటు వేసేవారు ప్రథమ ప్రాధాన్య ఓటుకు 1 అంకె వేయాలని టిక్కులు గుర్తులు గాని వేయరాదని ఒకవేళ టిక్కులు లేదా గుర్తులు వేస్తే అవిచెల్లవని అన్నారు. నచ్చిన అభ్యర్థి పేరు ఉన్న బాక్సులో పోలింగ్ కేంద్రంలో ఇచ్చే పెన్నుతో ప్రాధాన్యం ప్రకారం నెంబరు వేస్తే ఓటు నమోదు అవుతుందన్నారు. ఒకసారి వేసిన నెంబరు మళ్లీ రిపీట్ కాకూడదని చెప్పారు. వృద్ధులైన సంఘ సభ్యులకు ఓటింగ్ పక్రియలో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి బెల్లంకొండ హృదయరాజు, సోమయశాస్త్రి, గంటయ్య, సంఘ సభ్యులు మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్, ఉపాధిహామీ పనులను తనిఖీ చేస్తున్న పీడీ

కొల్లిపర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కూలీలందరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఉపాధిహామీ పనులకు వచ్చిన కూలీలతో సమావేశమై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలని, జాబ్‌కార్డులో ఉన్నవారు మాత్రమే ఉపాధి హామీ పనులకు రావాలని కూలీలకు తెలియజేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో పీడీ సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పనులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భగా శంకర్ మాట్లాడుతూ జిల్లాలోనే కొల్లిపర మండలంలో ఉపాధిహామీ పనులకు చాలా తక్కువమంది కూలీలు వస్తున్నారన్నారు. కొన్ని పంచాయతీల్లో అసలు ఉపాధి హామీ పనులకు కూలీలు ఎందుకు రావటం లేదని ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులకు రావాలన్నారు. ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కొలతల ప్రకారం పనులు పూర్తిచేసి దినసరి కూలి రూ 300లు వచ్చేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలతో పాటు మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ గురించి తెలియజేయాలన్నారు.

కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీవో ఎం. రవి, టెక్నికల్ అసిస్టెంట్ అజయ్, బీఎఫ్‌టీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తా

● కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్


వర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

పెదకాకాని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సంక్షేమానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ పట్టభద్రుల కూటమి అభ్యర్థి, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విశ్వవిద్యాలయంలో పర్యటించారు. మాదిగ విద్యార్థి సమాఖ్య విద్యార్థి నాయకులు, బీసీ విద్యార్థి సంఘం, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని పలు కార్యాలయాలు విభాగాలు సందర్శించి గ్రాడ్యుయేట్ అభ్యర్థులను ఓట్లు అభ్యర్థించారు. వికాస భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను, ఉద్యోగులనుద్దేశించి ఆలపాటి మాట్లాడుతూ విద్యార్థులకు, ఉద్యోగులకు మేలు చేసింది కూటమి ప్రభుత్వమేనన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ద్వారా ఎన్నో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా ఉపాధి పరిశోధనారంగాలు గణనీయమైన అభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షులు కాకుమాను ప్రఫుల్, ఏఎన్యూ టీఎన్ఎస్ఎఫ్ శాఖ అధ్యక్షుడు నితీష్, టీఎన్ఎస్ఎఫ్ శాఖ ప్రధాన కార్యదర్శి నరేంద్ర, నాయకులు ఖయ్యూం ఎంఎస్ఎఫ్ ముఖ్య సలహాదారుడు దుడ్డు నరేంద్ర, వైస్ ప్రెసిడెంట్ అఖిల్, సెక్రటరీ కోటి, జాయింట్ సెక్రటరీ రాజేష్, చంద్రశేఖర్, బీసీ విద్యార్థి సంఘ నాయకులు వీరాంజనేయులు, రవికుమార్, గణేష్ జనసేన విద్యార్థి సంఘ నాయకులు పవన్ సాయి, మహేష్ పరిశోధకులు టి గంగాధర్, రాజేష్, అభిషేక్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: కృష్ణా, గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యంత మెజారిటీతో గెలిపించుకుందామని అర్బన్ బ్యాంక్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు మంగమూరి హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్‌లు అన్నారు. మంగళవారం వివిధ వార్డుల్లో పట్టభద్రులను కలిసి విడివిడిగా ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

● కొల్లిపర: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆలపాటి విజయం కోసం టీడీపీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. పట్ట భద్రులను, ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును రాజేంద్రప్రసాద్‌కు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నీటి సంఘ ఉపాధ్యక్షుడు అరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, బి.లంకకోటిరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, బి.చంద్రిక, సి.సూర్యప్రకాశ్, పిల్లి సత్యానందం, షేక్ రఫీ, గోళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి దేవినేని ప్రచారం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని మాచవరం, ములుకుదురు, గ్రామాలలో దేవినేని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, స్టేట్ మైనార్టీ కమిటీ సభ్యులు మోసిన్, కూటమి పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధిక కేసుల పరిష్కారానికి కృషిచేయాలి

● న్యాయాధికారి రాజశేఖర్


న్యాయమూర్తితో సమావేశమైన పోలీసు అధికారులు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి జరగాలని రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో డివిజన్ స్థాయి పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోదగిన అన్ని రకాల క్రిమినల్ కేసులను పరిష్కరించడానికి కక్షిదారులను సమావేశపరిచి అవగాహన కల్పించి సామరస్యంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి పోలీసు అధికారులకు సూచించారు. ఈ విధంగా పరిష్కరించుకోవడం వలన కక్షిదారులకు సమయం, ధనం, ఆదా అవడంతో పాటు ఇరువర్గాలు విజేతలైనట్లేనని వివరించారు.

హోంగార్డు శ్రీనుకు ఘన నివాళి


హోంగార్డ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్ఐలు ప్రతాప్‌కుమార్, కోటేశ్వరరావు, (శ్రీను ఫైల్ ఫొటో)

తెనాలి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే హోంగార్డు ఎద్దు శ్రీనివాస్ (52) అకాల మరణం బాధాకరమని రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్, కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావులు అన్నారు. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న ఎద్దు శ్రీనివాస్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. తెనాలిలోని పాండురంగపేటలో శ్రీనివాస్ ఇంటి వద్ద ఆయన మృతదేహాన్ని రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్, కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు, పలువురు పోలీస్ సిబ్బంది కలిసి సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.40వేలు శ్రీను కుటుంబానికి అందించారు. పెద్దసంఖ్యలో పోలీసులు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుధవారం అంతిమసంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.


ముస్లింలను ఓటుబ్యాంకుగా వాడుకున్న వైసీపీ

● ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అహ్మద్


మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్‌కు అభినందనలు తెలుపుతున్న ఇమాంలు, మౌజన్‌లు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ముస్లింలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ విమర్శించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్‌ను పలువురు ఇమాంలు, మౌజన్‌లు కలిసి మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గడ్డుగా ఉన్నప్పటికీ ముస్లింల కోసం రూ.45 కోట్లు విడుదల చేయడం అభినందనీయమన్నారు. ముస్లిం విద్యార్థుల కోసం ఉర్దూ యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు అంగీకరించటం హర్షదాయకమన్నారు. ముస్లిం మైనార్టీస్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని పేద ముస్లింలకు అవసరమైన సహాయ సహకారాలు భవిష్యత్తులో అందించనున్నట్లు వివరించారు. తొలుత మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్‌ను పలువురు సత్కరించారు.

ఆలయ ప్రాంగణంలో స్టీల్ క్యూ లైన్ ఏర్పాటుకు విరాళం


ఆలయ ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న భక్తుడు బండారు రామారావు

పెదకాకాని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో స్టీల్ క్యూ లైన్ ఏర్పాటుకు విరాళం ఇచ్చేందుకు భక్తుడు ముందుకు వచ్చారు. ఈ మేరకు పెదకాకాని గ్రామానికి చెందిన బండారు రామారావు (రాము) ధర్మపత్ని ధనలక్ష్మి దంపతులు మంగళ వారం ఆలయ ప్రాంగణంలో ఉచిత ప్రసాద వితరణ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న స్టీల్ క్యూలైన్లకు రూ.50,000 నగదును ఆలయ ఉప కమిషనర్ ద్వారా కాంట్రాక్టరుకు అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, చిత్రపటం అందజేశారు.


ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పులను సిద్ధం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పులు సిద్ధం

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పురపాలక సంఘ పరిధిలో 40వార్డులలోని ఓటర్లకు పంపిణీ చేసేందుకు బూత్‌లవారీగా లిస్టుల ప్రకారం ఓటు స్లిప్పులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు మంగళవారం సిద్ధం చేస్తున్నారు. వార్డుల వారీగా ఓటర్లకు ఓటు స్లిప్పులను పంపిణీ చేయడం జరుగుతుందని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

విస్తృతంగా తనిఖీలు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. మంగళవారం ములుకుదురు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అధికారులు తనిఖీలు నిర్వహించి వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఐదు పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. ఓటర్లకు అవసరమైన విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, అర్బన్, రూరల్ సీఐలు రవికిరణ్, వై కోటేశ్వరరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ సాయిరేవతి, శివరామ కిరణ్

పవర్ లిఫ్టింగ్‌లో తెనాలి క్రీడాకారుల ప్రతిభ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ నెల 16న గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలు లభించాయి. 84కిలోల జూనియర్ విభాగంలో బి.లిఖిత గోల్డ్ మెడల్ సాధించింది. 47కిలోల విభాగంలో షానూన్ గోల్డ్ మెడల్, 57, 74, 83, 93 కిలోల విభాగాల్లో ధర్మతేజ, మానిచంద్, మణిఈశ్వర్‌లకు గోల్డ్ మెడల్స్ కౌషిక్‌కు సిల్వర్ మెడల్ లభించాయి. క్రీడాకారులను శిక్షణ పొందిన క్విక్ జిమ్‌లో మంగళవారం వారిని పలువురు అభినందించారు. మేనేజర్ భార్గవకుమార్, సాయిరేవతి, శివరామకిరణ్ పాల్గొన్నారు.


యూనివర్సిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఏఎన్‌యూలో లక్ష్మణరావు ప్రచారం

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్.లక్ష్మణరావు మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రచారం నిర్వహించారు. వర్సిటీలోని పరీక్ష భవన్, అంబేద్కర్ లైబ్రరీ, పరిపాలన భవన్, దూరవిద్య కేంద్రంతోపాటు పలు కళాశాలల విభాగాలను సందర్శించి ఉద్యోగులను ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మండలిలో గ్రాడ్యుయేట్ల సమస్యలు పరిష్కారంకోసం కృషి చేసేందుకు తగిన అవకాశం కల్పించాలని కోరారు. తాను ఎమ్మెల్సీగా ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలపై పోరాడినట్లు వివరించారు. శాసనమండలిలో గళంవిప్పి నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇప్పించినట్లు పేర్కొన్నారు.

పన్నులను సకాలంలో చెల్లించండి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పన్నులను సకాలంలో చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తన చాంబర్‌లో మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులను సకాలంలో చెల్లించాలన్నారు. సెలవు దినాలలో కూడా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులను జమచేసి తగిన రసీదును పొందవచ్చన్నారు. వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని నూతనంగా వ్యాపార సంస్థలను ప్రారంభించిన వారు నూతన ట్రేడ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధలను పాటించని వారిపై పురపాలక సంఘం చట్టం ప్రకారం జరిమానాలను విధిస్తామని హెచ్చరించారు.


పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

వరద ప్రభావిత గ్రామాల్లో రోటరీ క్లబ్ చేయూత

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత గ్రామాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం చేయూత అందించింది. తుళ్లూరు మండలంలోని రాయపూడిలో మరమ్మతులు నిర్వహించిన పాఠశాలను మంగళవారం ప్రారంభించారు. రోటరీ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి మాట్లాడుతూ, క్లబ్ ఆధ్వర్యంలో అందరి సహకారంతో విశిష్ట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రత్నప్రభాకర్, విష్ణుబాబు, ఈదర శ్రీనివాసరావు, మురళీకృష్ణ, గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకటపూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, రాంబాబు, వెంకటరామయ్య, గాజుల శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.